# స్వల్ప పెనాల్టీతో.. గట్టెక్కారు!



ఎన్ఎల్ఎస్ పరిధిలోని ఐదు పొగాకు వేలం కేంద్రాల్లో 2024-25 పంట కాలానికి సంబంధించి పొగాకు బోర్డు అనుమతి మేరకు రైతులు పండించిన పొగాకు అమ్మకాలు దాదాపు 95 శాతం వరకు పూర్తయ్యాయి. అయితే రైతులు అదనంగా పండించిన సుమారు 20 మిలియన్ కిలోలకు పైగా ఉన్న పొగాకుపై స్వల్ప అపరాధ రుసుము విధించి తమ పొగాకును ఆయా వేలం కేంద్రాల ద్వారా అమ్ముకోవడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య శాఖ నుంచి గెజిట్ పబ్లికేషన్ ద్వారా ఆదేశాలు జారీ చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల తొమ్మిదో తేదీ మంగళవారం నుంచి అమ్మకాలు ప్రారంభం కానున్నాయి.

- అదనంగా పండించిన పొగాకుపై కేంద్ర వాణిజ్య శాఖ నిర్ణయం
- స్వల్ప పెనాల్టీ విధింపుతో కొనుగోళ్లకు ఆమోదం
- ఇప్పటికే 95 శాతం పూర్తయిన పొగాకు అమ్మకాలు
- రేపటి నుంచి అదనపు పొగాకు కొనుగోళ్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు.. ఎంపీ పుట్టా మహేశ్‌కు కృతజ్ఞతలు

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కరోనా కారణంగా పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ క్రమంలో గతేడాది ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ చొరవతో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్ సహకారంతో రైతులు అదనంగా పండించిన పొగాకుపై అపరాధ రుసుం లేకుండా తమ పొగాకును బోర్డు ద్వారా అమ్ముకున్నారు. అదనంగా పండించిన సుమారు ఆరు మిలియన్ కిలోల పొగాకుకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా అమ్ముకోవడం వల్ల ఎన్ఎల్ఎస్ పరిధిలో ఉన్న దేవరపల్లి,గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలో రెండు వేలం కేంద్రాల పరిధిలో ఉన్న రైతులు సుమారు రూ.10 నుంచి 20 కోట్ల వరకు లాభ పడ్డారు. ఈ సంవత్సరం పంట దిగుబడి బాగా రావడంతో 20 మిలియన్ కిలోలకు పైగా పొగాకు అదనంగా పండింది. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే బావుంటుందని రైతులు ఎంపీను కోరారు. దీంతో ఎంపీ మహేశ్ కేంద్ర వాణిజ్య శాఖ మంత్రితో పలుసార్లు చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో స్వల్ప అపరాధ రుసుముతో రైతులకు ఊరట కలిగించారు. గతంలో అదనంగా పండించిన పొగాకుకు రైతుల నుంచి నూటికి ఇరవై ఐదు శాతం అపరాధ రుసుము వసూలు చేసిన సందర్భాలు ఉన్నాయని రైతు సంఘ నాయకుడు పొన్నగంటి అనిల్ తెలిపారు.

## పెనాల్టీ,సర్వీసు చార్జీల వివరాలు

- ఒక బ్యారన్‌కు 41 క్వింటాళ్ల పొగాకు పండించడానికి బోర్డు అనుమతినిస్తుంది. బోర్డు ఇచ్చిన అనుమతి కంటే అదనంగా పదిశాతం వరకు పొగాకు పండించిన రైతుకు ఎటువంటి పెనాల్టీలు లేవు. రైతు అమ్మకాల విలువపై (మిగతా 8వ పేజీలో)

## రైతులందరికీ ఎంతో మేలు

గత మూడేళ్ల ప్రకృతి వైపరీత్యాల వల్ల పొగాకు పంట బాగా తక్కువ పండింది. ఈ ఏడాది ప్రకృతి సహకరించడం వల్ల బాగా పండింది. అదనంగా పండిన పొగాకుపై కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ పెనాల్టీతో అమ్ముకోవడానికి అవకాశం కల్పించడం సంతోషంగా ఉంది. రైతులందరికీ ఎంతో సహాయం చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

\- పొన్నగంటి అనిల్, పొగాకు రైతు,చల్లావారిగూడెం

## ఎంపీ సహకారం మరువలేనిది

ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ సహకారం మరువలేనిది పొగాకు, పామాయిల్ రైతులకు ఎంపీ ఎంతో సహకరిస్తున్నారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రితో మాట్లాడి గతేడాది లాగానే ఈ ఏడాదీ అదనపు పొగాకును అతి తక్కువ పెనాల్టీతో అమ్ముకునేలా వెసులుబాటు కల్పించారు. ఎన్ఎల్ఎస్ పరిధిలో ఉన్న పదిహేను వేల మంది పొగాకు రైతులు ఎంపీకి రుణపడి ఉంటాము.

\- పరిమి రాంబాబు, రైతు సంఘం అధ్యక్షుడు, వేలం కేంద్రం - 18, జంగారెడ్డిగూడెం

## గ్రహణం మూతపడ్డ ఆలయాలు



రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు జిల్లాలోని ప్రధాన ఆలయాలు ఆదివారం మధ్యాహ్నం మూతబడ్డాయి. చంద్రగ్రహణ విరామం అనంతరం సోమవారం ఉదయం నాలుగు గంటలకు ఆలయాలను తెరచి సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనాన్ని కల్పిస్తారు.



చినవెంకన్న ఆలయం బంగారువాకిలికి, గుర్వాయిగూడెం మద్ది ఆలయ ప్రధాన ద్వారానికి తాళాలు వేస్తున్న అర్చకులు.



సత్రంపాడు జడ్పీ హైస్కూలు పరీక్ష కేంద్రంలో ఏపీపీఎస్సీ కార్యదర్శి పరిశీలన

## ఏపీపీఎస్సీ పరీక్ష ప్రశాంతం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 17 కేంద్రాల్లో ఆఫ్‌లైన్ విధానంలో జరిగిన పరీక్షకు 7,078 మంది దరఖాస్తు చేసుకోగా ఉదయం సెషన్ పరీక్షకు 6,128 మంది హాజరయ్యారు. ఏలూరు ఎన్ఆర్ పేటలోని చైతన్య విద్యాసంస్థలు, వట్లూరు సీఆర్ఆర్ పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాల, సత్రంపాడు జడ్పీ హైస్కూలులో పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణను ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజబాబు పరిశీలించారు. ఆయన వెంట డీఆర్వో విశ్వేశ్వరరావు, రెవెన్యూ అధికారులున్నారు.

## 12 మంది డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 సెలక్షన్ జోన్ పరిశీలనకు వచ్చిన మూడోవిడత అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఆదివారం ఏలూరు డీఈవో కార్యాలయంలో జరిగింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి మొత్తం 12 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను శనివారం రాత్రి 10.30 గంటలకు విడుదల చేశారు. అభ్యర్థుల్లో ఏడుగురు దివ్యాంగులుండగా, వీరందరి వైకల్యశాతం నిర్ధారణకు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సోమవారం మెడికల్‌బోర్డు ఎదుట హాజరుకావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ ఎం.వెంకటలక్ష్మమ్మ పర్యవేక్షించారు.

## మా గ్రామంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి..

- సెల్ టవర్ ఎక్కిన గవరవరం గ్రామస్థుడు



కొయ్యలగూడెం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలంటూ ఒక వ్యక్తి సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. ఈ సంఘటన ఆదివారం ఉదయం గవరవరంలో జరిగింది. గ్రామానికి చెందిన మిరియాల బాబూరావు అనే వ్యక్తి సెల్‌టవర్ ఎక్కి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలంటూ ఆందోళన చేశాడు. గవరవరం పంచాయతీని గత పంచాయతీ ఎన్నికల ముందు గవరవరం, చొప్పరామన్నగూడెం రెండు పంచాయతీలుగా విడదీశారు. ఈ విషయంలో కొంతమంది హైకోర్టుకు వెళ్లడంతో గతంలో ఈ రెండు గ్రామాల్లో ఎన్నికలు జరగలేదు. వచ్చే జనవరిలో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వం నుంచి ప్రకటన రావడంతో గ్రామానికి చెందిన బాబూరావు సెల్ టవర్ ఎక్కి వచ్చే ఎన్నికల్లో అయినా తమ గ్రామానికి ఎన్నికలు నిర్వహించాలంటూ హల్‌చల్ చేశాడు. సర్పంచ్‌లు లేకపోవడంతో తమ రెండు గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. హైకోర్టులో కేసును విత్‌డ్రా చేసుకోవాలని కోరాడు. గ్రామస్తులు అక్కడకు చేరుకుని అతనికి నచ్చజెప్పగా కిందికి దిగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# దర్జాగా ఇసుక దందా..!

- తెలంగాణకు అక్రమంగా తరలింపు
- సొమ్ములు చేసుకుంటున్న అక్రమార్కులు
- అరకొరగా కేసుల నమోదు

చింతలపూడి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇసుకను ఉచిత ఇసుక పాలసీ తీసుకొచ్చింది. దీనిని తమకు అనుకూలంగా మలుచుకున్న కొందరు ఇసుక దందాకు పాల్పడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా సరిహద్దుల దాటించి తెలంగాణకు తరలిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు. అధికారులు అరకొరగా కేసులు నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

## రోజుకు 50కు పైగా లారీలు

చింతలపూడి మండలం సరిహద్దు గ్రామాల మీదుగా కొద్ది నెలలుగా ఇసుక దొడ్డిదారిన తెలంగాణకు తరలిపోతోంది. 30, 35 టన్నులు ఉండే ఇసుక లారీలు రోజుకు 50కు పైగా తెలంగాణ ప్రాంతాలకు వెళ్తున్నాయి. గోదావరి సరిహద్దు తాళ్లపూడి, బల్లిపాడు, వేగేశ్వరపురం రీచ్‌ల నుంచి కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మీదుగా జీలుగుమిల్లి,మక్కినవారిగూడెం, ఎర్రగుంటపల్లి, సీతానగరం మీదుగా లేదా కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం, చింతలపూడి,రాఘవపురం, గురుభట్లగూడెం మీదుగా తెలంగాణ ప్రాంతాలకు చేరుతోంది. ఈ మార్గాల్లో వెళ్లే సమయంలో తమకు అనుకూలంగా ఉన్న లూప్ మార్గాల్లో ఇసుకను తరలించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మార్గమధ్యంలో అధికారులు ఎవరైనా ఆపితే ముడుపులు అందిస్తూ దర్జాగా ఇసుకను తరలిస్తున్నారు. వేబిల్లులు కూడా ఈ లూప్ లైన్ గ్రామాల పేర్లతో నమోదు చేస్తున్నట్టు సమాచారం.



చింతలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన ఇసుక లారీ

## లూప్ లైన్ల మీదుగా తరలింపు

గత వైసీపీ ప్రభుత్వం ఇసుక అధిక ధరలకు విక్రయించడంతో భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయామని ఆందోళనలకు సైతం దిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు అధికారంలోకి రాగానే ఇసుకను ఉచితం చేస్తూ పాలసీ తీసుకొచ్చారు. దీనిని అవకాశంగా తీసుకుని కొందరు ఇసుక దందాకు తెర తీశారు. తెలంగాణ ప్రాంతం నుంచి కాకినాడ, రాజమహేంద్రవరం, విశాఖ, మండపేట వంటి ప్రాంతాలకు హైదరాబాదు, ఖమ్మం నుంచి సరుకు లోడు లారీలను ఇక్కడకు రప్పించి దిగుమతి చేయిస్తున్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ఆ లారీలు ఖాళీగా వెళ్లకుండా ఇసుకను లోడు చేసి అక్రమంగా సరిహద్దులు దాటించి సొమ్ములు చేసుకుంటున్నారు. తెలంగాణలోని సత్తుపల్లి, ఖమ్మం ప్రాంతాలకు ఇసుకను తరలించి టన్ను రూ.1000 నుంచి రూ.1200లకు విక్రయిస్తున్నట్టు సమాచారం. చింతలపూడి మండలం తెలంగాణ సరిహద్దులో ఉండడంతో రెండు లూప్ లైన్ల ద్వారా ఇసుకను లారీలను తరలిస్తున్నారు. అసలే రోడ్లు బాగోలేదు. అధిక లోడు లారీల రాకపోకలతో మరింత అధ్వానంగా మారుతున్నాయి.

## ఒక్కరోజే 16 లారీలు పట్టివేత

చింతలపూడి సర్కిల్ పోలీసులు ఇటీవల ఈ రెండు మార్గాల్లో నిఘా వేసి తనిఖీలు జరపగా ఒకరోజే 16 ఇసుక లారీలు పట్టుపడ్డాయి. కేసులు నమోదు చేసి రెవెన్యూ శాఖకు బదిలీ చేస్తామని పోలీసులు చెబుతున్నారు. దీనిపై రెవెన్యూ శాఖ డిప్యూటీ తహసీల్దార్‌ను అడుగగా తమకు బదిలీ కాగానే మైనింగ్ శాఖ అపరాధ రుసుము విధిస్తుందని చెబుతున్నారు. ఈ లూప్‌లైన్లలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని పలువురు సూచిస్తున్నారు.

## రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువుల పంపిణీ : కలెక్టర్

ఏలూరుసిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులను అందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎరువుల పంపిణీపై ఆదివారం వ్యవసాయ శాఖ, సహకార శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ఎరువుల పంపిణీలో జిల్లాలో ఎక్కడా ఎటువంటి సమస్యలు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మోతాదుకు మించి ఎరువుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎరువులకు ఎటువంటి కొరత లేదని , ఈనెల 10,13 తేదీలలో మరో వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుందన్నారు. జిల్లాకు చేరుకున్న ఎరువులు సొసైటీలకు వెంటనే చేర్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్‌బాషాను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా నుంచి ఎరువులు ఇతర ప్రాంతాలకు తరలి పోకుండా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. డీసీవో ఆరిమిల్లి శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సీహెచ్ ప్రసాదగుప్తా, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరక్టర్లు , మండల వ్యవసాయ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల సరఫరాపై నేడు మంత్రి నాదెండ్ల సమీక్ష

ఏలూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 8వ తేదీన ఏలూరుకు రానున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు కలెక్టరేట్‌లో ఎరువుల సరఫరాపై అధికారులతో ఆయన సమీక్షిస్తారు. మరో మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు పాల్గొనున్నారు.

## సూపర్ సిక్స్ సభ.. అనంతపురం ఇన్‌చార్జిగా గన్ని



అనంతపురంలో పార్టీ శ్రేణులతో సమీక్ష పాల్గొన్న ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

ఏలూరు,సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన సూపర్‌సిక్స్ సక్సెస్‌పై రాష్ట్రస్థాయిలో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను విజయంతం చేయడంలో పార్టీ శ్రేణులను ఒక తాటిపై నిలిపే బాధ్యతను ఆప్కాబ్ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుకు పార్టీ అధిష్ఠానం అప్పగించింది. ఈనెల 10న అనంతపురంలో సీఎం చంద్రబాబునాయుడు పాల్గొనే సూపర్ సిక్స్ విజయోత్సవ సభకు అనంతపురం, సింగనమల్లు నియోజకవర్గాలను కార్యోన్ముఖులను చేయడానికి మంత్రి కొల్లురవీంద్ర, గన్ని వీరాంజనేయులుపై గురుతర బాధ్యతను పెట్టింది. దీంతో గన్ని వీరాంజనేయులు అనంతపురంలో మకాం వేశారు. స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌తో క్లస్టర్ల వారీగా జనసమీకరణకు ఇన్‌చార్జులకు శని,ఆదివారాల్లో దిశానిర్దేశం చేశారు.

# దానగూడెం ఘటనలో ఏడుగురి అరెస్టు

- నిందితులపై హత్యాయత్నం, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు
- జిల్లా వ్యాప్తంగా అమలులో పోలీస్ యాక్టు30
- దానగూడెం ఎవరూ రావద్దు : డీఎస్పీ

ఏలూరు క్రైం/కైకలూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కైకలూరులోని దానగూడెం ఘర్షణ ఘటనపై హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఏడుగురిని అరెస్టు చేసి నట్టు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ తెలిపారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్, టౌన్ సీఐ కృష్ణలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ తెలిపిన వివరాలివి.. కైకలూరు టౌన్ పరిధిలోని కరకట్ట దగ్గర గతనెల 31వ తేదీ రాత్రి గణేష్ విగ్రహ ఊరేగింపు కాపుల వీధిలో ఆంజనేయ స్వామి గుడి వద్దకు వచ్చేసరికి దానగూడెంనకు చెందిన ఇంటి సాగర్ తన ఇంటికి వెళ్తూ ఊరేగింపు దాటుతున్న సమయంలో ఒకసారిగా పడిపోయాడు. దానికి కారణం ఊరేగింపులోని కొందరు యువకులని తెలుసుకుని దానగూడేనికి చెందిన మహిళలు, యువకులు వచ్చి ఊరేగింపులో ఉన్న వారితో గొడవ పడ్డారు. అక్కడే ఉన్నపోలీసులు వెంటనే ఇరువర్గాల వారిని సర్దిచెప్పి పంపించి వేశారు. మరుసటి రోజున ఇరు వర్గాల పెద్దలను, ఘర్షణకు కారణ మైన వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈనెల 5వ తేదీ రాత్రి దానగూడెంకు చెందిన పైయద్దు అజయ్ అతని స్నేహితులు మరో ఇద్దరు మోటారు సైకిల్‌పై కైకలూరు వెళ్తుండగా ఆంజనేయస్వామి గుడి వద్దకు వచ్చేసరికి గణేష్ ఊరేగింపులో ఉన్న కొంత మంది యువకులు మోటారు సైకిల్‌కు దారి ఇవ్వకపోవడంతో దారి ఇవ్వమని అజయ్ కోరగా కొందరు యువకులు కులం పేరుతో దూషిస్తూ దాడి చేయడంతో ప్రాణ భయంతో వారు పారి పోయారన్నారు. విషయం తెలిపి దానగూడెంకు చెందిన కొంతమంది కాపుల బజారుకు చేరుకోగా ఇరువర్గాలు కర్రలతో, రాళ్లతో దాడులు చేసుకున్నారన్నారు. సమాచారం అందుకున్న కైకలూరు పోలీసులు వారిని చెదరగొట్టి గాయపడిన పైయ్యద్దు అజయ్, గొంతుపులి దినేశ్‌లను ఆసుపత్రికి తరలించి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారన్నారు. ఆసుపత్రిలో బాధితుల నుంచి వాగ్మూలం నమోదు చేసుకున్నామన్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు నిందితులపై హత్యాయత్నం, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. నిందితులైన తులసి శివ కుమార్ అలియాస్ శివ (22), తోట కార్తికేయ అలియాస్ కార్తి (23), తులసి పూర్ణచంద్రరావు అలియాస్ పూర్ణ (46) పోతులనాగమణికంఠ అలియాస్ బాలు (31), పిచ్చుకల రాజేష్ (43), తోట సంజయ్ భార్గవ్ అలియాస్ బబ్బు (25), కటికన జయప్రకాష్ అలియాస్ జెపి (25)లను అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో మిగిలిన వారిని అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామన్నారు.

## అల్లర్లకు పాల్పడిన వారిని శిక్షిస్తాం : ఎమ్మెల్యే

కైకలూరులో అల్లర్లు జరగడం దురదృష్టకరమని, అల్లర్లకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించేలా చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఇరువర్గాల ఘర్షణలో గాయపడిన దానగూడేంకు చెందిన గొంతుపులి దినేష్‌బాబు, పైయద్దు అజయ్‌ల కుటుంబ సభ్యులతో ఆదివారం ఫోన్‌లో ఎమ్మెల్యే మాట్లాడారు. దాడులకు పాల్పడిన ఎంతటివారైనా ఖచ్చితంగా శిక్షిస్తామని ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. తన భార్య మనోరమ అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఐసీయూలో చికిత్స పొందుతున్నారని, తాను అక్కడ ఉండడం వల్ల బాధితులను నేరుగా పరామర్శించలేకపోయానని, బాధితులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కట్టుదిట్టమైన పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే కైకలూరు వచ్చి బాధితులను నేరుగా పరామర్శిస్తానని తెలిపారు.



విలేకరుల సమావేశంలో వివరాలు తెలుపుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్, కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, టౌన్ సీఐ కృష్ణ

## అవాస్తవాలు పోస్టు చేస్తే చర్యలు : డీఎస్పీ

శాంతి భద్రతల దృష్ట్యా పోలీస్‌యాక్టు 30 (బీఎన్ఎస్ 163)యాక్టు జిల్లా వ్యాప్తంగా అమలులో ఉందని ఇతర ప్రాంతాల వారు దానగూడెం గ్రామానికి రావద్దని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ సూచించారు. కొంతమంది పరామర్శల పేరుతో కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు సోషల్ మీడియాలో రకరకాల అవగాహన లేని కథనాలతో పోస్టులు చేస్తున్నారని శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. దానగూడెంనకు ఇతర ప్రాంతాల నాయకులు ఎవరైనా వెళ్లాలనుకుంటే ముందస్తుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు.

## కరకట్టపై నిఘా.. పోలీస్ పికెట్

కైకలూరులో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఆదివారం బందోబస్తును నిర్వహించారు. ఎక్కడికక్కడే పోలీసులు పహారా కాస్తూ కైకలూరు కరకట్ట ప్రాంతానికి వెళ్లే వారి వివరాలను ఆరా తీశారు. బయట గ్రామాల ప్రజలు అక్కడకు వెళ్లేందుకు (మిగతా 8వ పేజీలో)

## ఉపాధ్యాయ ఉద్యోగాలకు వినికిడి అంకెల టాంపరింగ్!

ధ్రువపత్రాల్లో దిద్దివేతలపై జిల్లా విద్యాశాఖ ఫిర్యాదు.. విచారణ

లోపలి పేజీలో..

# బిట్స్ లా స్కూల్ అడ్మిషన్స్

ముంబాయిలోని బిట్స్ లా స్కూల్‌లో 2026 విద్యాసంవత్సరానికి సంబంధించి ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్), బీబీఏ ఎల్ఎల్‌బి(ఆనర్స్)లో అడ్మిషన్స్ కోసం నోటిఫికేషన్ వెలువడింది. ఈ కోర్సులకు బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా ఆమోదం ఉందని సంస్థ వెబ్‌సైట్ పేర్కొంది. టెక్నాలజీ అండ్ మీడియా లా, కార్పొరేట్ అండ్ ఫైనాన్షియల్ లా, ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ లా, ఆల్టర్నేట్ డిస్ప్యూట్ రిజల్యూషన్, అండ్ మీడియేషన్ అనే స్పెషలైజేషన్లు ఇందులో ఉన్నాయి.

**బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్) 120 సీట్లు ,**
**బీబీఏ ఎల్ఎల్‌బి(ఆనర్స్) 60 సీట్లు**
**మొత్తం 180**



**అర్హత:** కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. అలాగే క్లాట్/ఏఐఎల్ఈటీ/స్లాట్/ఎల్‌నాట్/బిట్స్ లాట్ లో స్కోరు సాధించి ఉండాలి. ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఎచీవ్‌మెంట్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.
**ఎంట్రెన్స్:** పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు 60 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాలి. నెగెటివ్ మార్కింగ్ లేదు. రీజనింగ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ తదితరాలపై ప్రశ్నలు ఉంటాయి.
**ఫీజు:** కాలేజీ ఫీజు రూ.7,37,100/-, హాస్టల్ ఫీజు 3,27,600/-.(కాలేజీలో స్కాలర్‌షిప్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.
**చివరి తేదీ:** 2026 జనవరి 6
**క్లాసులు ప్రారంభం:** 2026 జూలై
**వెబ్‌సైట్:** www.bitslawschool.edu.in

## గ్రామీణ బ్యాంకుల్లో పోస్టులకు
# ఐబీపీఎస్ నోటిఫికేషన్




దేశ వ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో క్లర్క్, ఆఫీసర్ల నియామకాల కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా మొత్తం 13,217 ఖాళీలు భర్తీ చేయనున్నారు. ఇందులో తెలంగాణలో 798 పోస్టులు(450 ఆఫీస్ అసిస్టెంట్లు, 348 ఆఫీసర్లు), ఏపీలో 152(150 ఆఫీస్ అసిస్టెంట్, 2 ఆఫీసర్) పోస్టులు ఉన్నాయి.

| పేరు | పోస్టులు |
| --- | --- |
| ఆఫీస్ అసిస్టెంట్స్ | 7972 |
| ఆఫీసర్ స్కేల్-1(అసిస్టెంట్ మేనేజర్) | 3907 |
| స్కేల్ 2, స్కేల్ 3 | 1338 |

(ఈ స్కేల్ 2, స్కేల్ 3లో అగ్రికల్చర్ ఆఫీసర్, లా ఆఫీసర్, సీఏ, ఐటీ, జనర్ బ్యాంకింగ్ ఆఫీసర్, మార్కెటింగ్ ఆఫీసర్, ట్రెజరీ మేనేజర్ తదితరాలు ఉన్నాయి).

**వయసు:** ఆఫీస్ అసిస్టెంట్‌కు 18-25 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-1కు 18-30 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-2కు 21-32 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-1కు 21-40 ఏళ్లు ఉండాలి. సరైన కటాఫ్ డేట్స్ కోసం నోటిఫికేషన్ చూడవచ్చు.
**ఎంపిక విధానం:** ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ(కొన్ని పోస్టులకు ఇంటర్వ్యూ లేదు) ద్వారా ఎంపిక జరుగుతుంది. మల్టీ పర్పస్ అసిస్టెంట్ ప్రిలిమినరీ పరీక్షలో రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీపై 80 మార్కులకు, 80 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 45 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఆఫీసర్ ప్రిలిమినరీ పరీక్షలో రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 80 మార్కులకు, 80 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 45 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. మెయిన్‌లో రీజనింగ్, కంప్యూటర్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ తదితరాలపై ప్రశ్నలు ఉంటాయి.
**పరీక్ష:** 2025 నవంబర్/డిసెంబర్‌లో ప్రిలిమ్స్, 2025 డిసెంబర్ /2006 జనవరిలో మెయిన్స్ ఉంటుంది.
**చివరి తేదీ:** 2025 సెప్టెంబర్ 29 **వెబ్‌సైట్:** https://ibps.in/

## SCHOLARSHIP ALERT

### Schaeffler India Social Innovator Fellowship Program 2025

***Description:*** Schaeffler India invites applications from individuals aged 18 to 35 who are building innovative, sustainable solutions with the potential to create meaningful social impact across India.
***Eligibility:*** Applicants must be Indian residents aged 18 to 35 years as of 1st July 2025. The fellowship is open to early-stage start-ups or NGOs with a working prototype ready for implementation.
***Prizes & Rewards:*** Exclusive mentorship at IIMA Ventures, IIM Ahmedabad, paired with an inspiring fellowship grant and access to extensive networking opportunities.
***Last Date to Apply:*** 15-09-2025
***Application mode:*** Online applications only
***Short Url:*** www.b4s.in/aj/SIA4

### Infosys Foundation STEM Stars Scholarship Program

***Description:*** An initiative of Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) disciplines.
***Eligibility:*** The applicants must be female students from India.
- They should have successfully completed their Class 12 examinations.
- Eligible students include those enrolled in the first year of undergraduate STEM courses at recognised NIRF-accredited institutions. Additionally, second-year B.Arch students and those pursuing five-year Integrated or Dual Degree programs are also welcome to apply.
- Female students intending to pursue engineering and medical courses in government colleges not listed in the NIRF rankings are also eligible to apply.
- The annual family income of the applicants must not exceed 8,00,000.

***Prizes & Rewards:*** The selected candidates will receive a scholarship of up to 1,00,000 per annum, covering actual expenses, for the duration of the course.
***Last Date to Apply:*** 15-09-2025
***Application mode:*** Online applications only
***Short Url:*** www.b4s.in/aj/ISTS3

buddy4study.com

## ఇండియన్ నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్లు

మొత్తం ఖాళీలు 260

ఇండియన్ నేషనల్ అకాడమీ(ఐఎన్ఏ) నుంచి షార్ట్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ వెలువడింది. 2026 జూన్‌లో ప్రారంభమయ్యే ఈ కోర్సుకు అవివాహితులైన పురుష, మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
**కోర్సు వివరాలు:** షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్, 2025

బ్రాంచి వివరాలు:
- ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్(జీఎస్(ఎక్స్)/హైడ్రో కేడర్): 57
- పైలెట్: 24
- నేవల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్: 20
- ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్: 20
- లాజిస్టిక్స్: 10
- నేవల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్: 20 పోస్టులు
- లా: 2
- ఎడ్యుకేషన్: 15
- ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్) 36
- ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్) 40
- నేవల్ కన్‌స్ట్రక్టర్: 16

**అర్హత:** పోస్టును బట్టి సంబంధిత బ్రాంచీలో బీఎస్సీ, బీకాం, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, లా,పీజీ, పీజీ డిప్లొమా ఉండాలి. అభ్యర్థులకు నోటిఫికేషన్‌లో పేర్కొన్న శారీరక, వైద్య ప్రమాణాలు ఉండాలి.
**వయస్సు:** 2001 జూలై 2 నుంచి 2007 జనవరి 1 లోపు జన్మించి ఉండాలి.
**చివరి తేదీ:** 2025 సెప్టెంబర్ 8.
**వెబ్‌సైట్:** https://www.joinindiannavy.gov.in/



## బీహెచ్‌ఈఎల్‌లో గ్రేడ్-4 ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు 515

భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్(బీహెచ్‌ఈఎల్)లోని హైదరాబాద్, విశాఖపట్నం సహా దేశ వ్యాప్తంగా ఉన్న 11 యూనిట్లలోని 515 ఆర్టిసన్ గ్రేడ్-4 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది. (ఫిట్టర్ 176, వెల్డర్ 97, టర్నర్ 51, మెషినిస్ట్ 104, ఎలక్ట్రీషియన్ 65, ఎలక్ట్రానిక్ మెకానిక్ 18, ఫౌండీమన్ 4)
**చివరి తేదీ:** 2025 సెప్టెంబర్ 12
**అర్హత:** పదో తరగతితోపాటు ఐటీఐ/ సమాన అర్హత ఉండాలి.
**వయస్సు:** 2025 జూన్ 1 నాటికి జనరల్/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 27 సంవత్సరాలు, ఓబీసీ వారికి 30, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 32 మించి ఉండకూడదు. సంబంధిత ట్రేడ్ అనుభవం ఉంటే వయోపరిమితిలో ఏడు సంవత్సరాల సడలింపు ఉంటుంది.
**వెబ్‌సైట్:** https://careers.bhel.in

## ఎల్ఐసీలో అప్రెంటిస్‌షిప్


ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌లో తెలంగాణ, ఏపీ సహా వివిధ రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న అప్రెంటిస్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నారు. అభ్యర్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి.
**చివరి తేదీ:** 2025 సెప్టెంబర్ 22
**వెబ్‌సైట్:** www.lichousing.com/careers

## నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2025

ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌ను ప్రారంభించింది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుకునే పేద విద్యార్థులను ప్రోత్సహించడం ఈ స్కీమ్ ఉద్దేశం. ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్(ఏపీ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) విభాగం దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పథకం కింద పరీక్ష నిర్వహించి, ఎంపికైన అభ్యర్థులకు స్కాలర్‌షిప్ అందిస్తారు. దేశ వ్యాప్తంగా లక్ష మందికి ఈ ప్రోత్సాహకాన్ని అందిస్తారు. అందులో ఆంధ్రప్రదేశ్‌కి 4087 స్కాలర్‌షిప్‌లను కేటాయించారు ప్రభుత్వ/ స్థానిక సంస్థలు/ మున్సిపల్/ ఎయిడెడ్ పాఠశాలలు/ మోడల్ పాఠశాలలు చదివే విద్యార్థులు అర్హత పరీక్ష రాయవచ్చు. రెసిడెన్షియల్ విద్యార్థులు అర్హులు కారు.
**ఆర్థిక ప్రోత్సాహం:** ఈ పథకానికి ఎంపికైన వారికి నెలకు వేయి చొప్పున ఏడాదికి మొత్తం 12,000/- రూపాయలు అందిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ పూర్తి చేసే వరకు నాలుగు సంవత్సరాలు ఈ ఉపకార వేతనం లభిస్తుంది.
**అర్హత:** ఏడో తరగతిలో 55 శాతం మార్కులు పొంది ఉండాలి. తుది ఎంపిక సమయానికి ఎనిమిదో తరగతిలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం 3,50,000/- రూపాయలకు మించి ఉండకూడదు.
**దరఖాస్తు:** రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డ్ వెబ్‌సైట్ ద్వారా ఆయా స్కూల్స్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలి. తర్వాత దరఖాస్తుల ప్రింటౌట్, ధ్రువీకరణ పత్రాలను డీఈవోలకు పంపాలి. ఓసీ/బీసీ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.100/-, ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు రూ.50/- ఉంటుంది.
**చివరి తేదీ:** 2025 సెప్టెంబర్ 30 **వెబ్‌సైట్:** www.bse.ap.gov.in/

# చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

## ఉత్కంఠకు లోనయ్యా
- ఇమ్రాన్ హష్మీ



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజిత్ దర్శకత్వంలో 'ఓజీ' అనే చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ఈనెల 25న ప్రపంచ వ్యాప్తంగా తెలుగుతో పాటు పలు భారతీయ భాషల్లో విడుదల కానుంది. కాగా, బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఈ చిత్రం ద్వారా తొలి సారిగా తెలుగు ప్రేక్షకులను పలకరించనున్నారు. ఇందులో ఆయన ప్రతినాయకుడి పాత్రలో కనిపించబోతున్నారు. కాగా, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఇమ్రాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'సినిమా కోసం నన్ను సంప్రదించినప్పుడు ఉత్కంఠకు లోనయ్యా. ఇది నాకు తెలుగులో తొలి సినిమా. సూపర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో కలసి తెరను పంచుకోవడం కంటే గొప్ప విషయం ఇంకేముంటుంది. పవన్ కల్యాణ్, చిత్ర దర్శకుడు సుజిత్‌తో కలసి పనిచేయడం అద్భుతమైన అనుభవం' అని చెప్పారు.

## నయన్‌తో డ్యూయెట్





చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయి. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. నేటి నుంచి హైదరాబాద్‌లో చిరంజీవి, నయనతారపై ఓ పాటను చిత్రీకరించనున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ గీతానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా, డ్యాన్స్ మాస్టర్ విజయ్ పోలంకి నృత్య రీతులు సమకూర్చుతున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఊహకందని మలుపులతో...



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. ఈ సందర్భంగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ 'ఇప్పటివరకూ ప్రేక్షకులు చాలా హారర్ సినిమాలు చూసి ఉంటారు. కానీ 'కిష్కింధపురి' చాలా ప్రత్యేకం. థ్రిల్లింగ్ అంశాలతో ఊహకందని మలుపులతో సాగుతుంది. విజువల్ ఎఫెక్ట్స్ అద్భుతంగా వచ్చాయి' అని అన్నారు. అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ 'నాకు చిన్నప్పటి నుంచి హారర్ చిత్రాలంటే చాలా ఇష్టం. 'కిష్కింధపురి' ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది. హారర్ ఎలిమెంట్స్ అబ్బురపరుస్తాయి' అని చెప్పారు.

## బిగ్‌బాస్ 9 ప్రారంభం




బుల్లితెర ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న టెలివిజన్ రియాలిటీ షో 'బిగ్‌బాస్ సీజన్ 9' ఆదివారం ప్రారంభమైంది. ఈ సీజన్ ఊహకందని మార్పులు, ఊహించని మలుపులతో ఉండబోతోందని వ్యాఖ్యాత నాగార్జున అన్నారు. ఈసారి సెలబ్రిటీలతో పాటు సామాన్యులకూ సమాన అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎంపిక చేసిన కంటెస్టెంట్లను ప్రేక్షకులకు పరిచయం చేశారు.

### ఈ సీజన్ కంటెస్టెంట్లు

| | |
| --- | --- |
| 1. కన్నడ నటి తనూజ పుట్టస్వామి | సెలబ్రిటీ |
| 2. హీరోయిన్ ఫ్లోరా సైనీ(ఆశా సైనీ) | సెలబ్రిటీ |
| 3. కల్యాణ్ పడాల | సామాన్యుడు |
| 4. 'జబర్దస్త్' ఇమ్మాన్యుయేల్ | సెలబ్రిటీ |
| 5. కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ | సెలబ్రిటీ |
| 6. హరిత హరీశ్(మాస్క్ మెన్) | సామాన్యుడు |
| 7. నటుడు భరణి | సెలబ్రిటీ |
| 8. నటి, యాంకర్ రీతూ చౌదరి | సెలబ్రిటీ |
| 9. డిమాన్ పవన్ | సామాన్యుడు |
| 10. నటి సంజన గల్రానీ | సెలబ్రిటీ |
| 11. గాయకుడు రాము రాథోడ్ | సెలబ్రిటీ |
| 12. శ్రీజ దమ్ము | సామాన్యురాలు |
| 13. హాస్య నటుడు సుమన్ శెట్టి | సెలబ్రిటీ |
| 14. ప్రియ శెట్టి | ఆడియెన్స్ పోల్ |
| 15. మర్యాద మనీశ్ | ప్రత్యేక ఎంపిక |

## గాయకుడిగా ప్రకాశ్ రాజ్



ఇప్పటి వరకు వెండి తెరపై తన విలక్షణ నటనతో మెప్పించిన ప్రకాశ్ రాజ్ ఇప్పుడు గాయకుడిగా కూడా అలరించబోతున్నారు. ఇందుకోసం ఆయన తన బృందంతో కలసి శ్రీలంక చేరుకున్నారు. ఇక్కడి క్యాండీ నగరంలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహిస్తోన్న 'నియేలిని గ్లోబల్ సమ్మిట్‌'లో ప్రకాశ్ రాజ్ పాల్గొంటున్నారు. ఈ సదస్సుకు 102 దేశాలకు చెందిన పౌర సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, శాస్త్రవేత్తలు సుమారు 500 మంది హాజరవుతున్నారు. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ఆహారభద్రత, వ్యవసాయ రంగంలో సంక్షోభంపై ప్రముఖంగా చర్చించనున్నారు. ఈ సదస్సుకు సంఘీభావంగా 'సాంగ్స్ ఆఫ్ రెసిలియన్స్' పేరుతో నిర్వహించనున్న కచేరీలో ప్రకాశ్ రాజ్ తన బృందంతో కలసి స్వయంగా కవితాగానం చేయనున్నారు.

## అద్భుతమైన ప్రయాణమిది


రాశీ ఖన్నా

'కెమెరాలు ఆగిపోయిన తర్వాత కూడా మరచిపోలేని కథలు ఉంటాయి. 'తెలుసు కదా' అలాంటి కథల్లో ఒకటి. అద్భుతమైన అనుభవాలన్నీ కలగలసిన ప్రయాణమిది' అని అన్నారు కథానాయిక రాశీ ఖన్నా. సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నీరజా కోన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'తెలుసు కదా'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సినిమా దీపావళి కానుకగా అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా తన షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న రాశీ ఖన్నా ఈ చిత్రానికి సంబంధించిన అనుభవాలు పంచుకుంటూ 'ఈ ప్రయాణంలో నాతో నడిచిన చిత్రబృందానికి కృతజ్ఞతలు. మేము సృష్టించిన ఈ ప్రపంచంలోకి మీరు అడుగుపెట్టే రోజు కోసం ఎదురుచూస్తున్నాను. మీకు అద్భుతమైన అనుభూతిని ఇస్తుందీ చిత్రం' అని అన్నారు.



## మిరాయ్ ప్రేక్షకులను మెప్పిస్తుంది


ధ్రువ సర్జా

తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన సూపర్‌హీరో చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. మంచు మనోజ్ ప్రతినాయక పాత్రను పోషించారు. ఈ నెల 12న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బెంగళూరులో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన కన్నడ హీరో ధ్రువ సర్జా మాట్లాడుతూ 'ఒక పండగ లాంటి వాతావరణంలో 'మిరాయ్' సినిమా విడుదలవుతోంది. అద్భుతమైన నటీనటులు, టెక్నీషియన్లు ఈ సినిమా కోసం పనిచేశారు. విశ్వప్రసాద్ భారీస్థాయిలో నిర్మించారు. ప్రచార చిత్రాలు అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. తేజ సజ్జా మాట్లాడుతూ 'పిల్లలు, పెద్దలు అందరూ కలసి చూసేలా 'మిరాయ్' చిత్రం ఉంటుంది. యాక్షన్‌కి థ్రిల్‌ని మేళవించి తీసిన ఓ మంచి చిత్రమిది. పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'ధ్రువ సర్జాతో ఓ చిత్రం చేయబోతున్నాం. 'మిరాయ్' చిత్రాన్ని మంచి నిర్మాణ విలువలతో తెరకెక్కించాం' అని తెలిపారు.



భీమవరం మావుళ్లమ్మ ఆలయ మహాద్వారం మూసివేసిన ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ, తదితరులు



పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ మహాద్వారం మూసివేత



జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వరస్వామి ఆలయం మూసివేత

గ్రహణం ఎఫెక్ట్

# ఆలయాల మూసివేత

ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో వెలవెలబోయిన క్యూలైన్లు



సంపూర్ణ చంద్ర గ్రహణం పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని ఆలయాలు ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. ఆదివారం రాత్రి 9.50 గంటల నుంచి రాహు గ్రస్థ చంద్ర గ్రహణం ప్రారంభం కావడంతో మధ్యాహ్నం ఆలయాల్లో మహానివేదనలు పూర్తిచేసి ఆలయాలను ఈవోల ఆధ్వర్యంలో మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ చేసిన అనంతరం భక్తులు దర్శనాలు ఉంటాయి. ఏలూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ బంగారు ద్వారాలు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారా యణమూర్తి సమక్షంలో అర్చకులు తాళాలు వేసి దర్శనాన్ని నిలుపుదల చేశారు. తిరిగి సోమవారం ఉదయం 9.30 గంటలకు స్వామివారి దర్శనం కల్పిస్తామని

## నేటి ఉదయం సంప్రోక్షణ అనంతరం ఆలయాల్లో దర్శనాలు

ఈవో తెలిపారు. కొండపైన శివదేవుని ఆలయం మూసివేశారు. చంద్రగ్రహణం ప్రభావంతో అరకొరగా భక్తులు ఆలయానికి వచ్చారు. జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలోని మద్ది అంజనేయ స్వామి ఈవో ఆర్వీ చందన ఆధ్వర్యంలో, జంగారెడ్డిగూడెం పట్టణంలోని గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఈవో కలగర శ్రీనివాస్ ఆధ్వర్యంలో, పెదపాడు మండలం అప్పనవీడు అభయాంజనేయస్వామి దేవాలయాలు మూసివేశారు.

● పశ్చిమ గోదావరి జిల్లాలో ఆలాయ అధికారాలు దగ్గరుండి ఆలయాలకు తాళాల వేయించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రముఖ దేవాలయాలైన భీమవరం మావుళ్లమ్మ ఆలయం, సోమేశ్వర స్వామి, భీమేశ్వరస్వామి ఆలయాలు, పాలకొల్ల క్షీరారామలింగేశ్వరస్వామి, అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి నరసాపురంలోని ఎంబర్‌మన్నార్ దేవాలయం, ఆచంటలోని నత్తారామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి ఆలయాలు మూసివేశారు.


- ద్వారకాతిరుమల/జంగారెడ్డిగూడెం/పెదపాడు/భీమవరంటౌన్/పాలకొల్లుఅర్బన్/ద్వారకాతిరుమల



అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం మూసివేత దృశ్యం



పెంటపాడులో మూసివేసిన బాల వేంకటేశ్వరస్వామి ఆలయం



జుత్తిగ సోమేశ్వరస్వామి ఆలయ గాలి గోపురంపై అరుదైన ఆకృతిలో సూర్యబింబం

### జుత్తిగ దేవాలయంపై సూర్యబింబం

పెనుమంత్ర : జుత్తిగ గ్రామంలోని ఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయ గాలి గోపురంపై అరుదైన ఆకృతిలో సూర్య బింబం భక్తులకు దర్శనమిచ్చింది. పౌర్ణమి రోజు సోమేశ్వర స్వామి గాలిగోపురంపై మధ్యాహ్నం సమయంలో కారు మబ్బులు కమ్ముకున్న ఆకాశం మధ్యలో శివుడు మూడో కన్ను తెరిచినట్లుగా ప్రతిబింబం కనిపించడంతో భక్తులు తిలకించారు.

ఆరోగ్య సంరక్షణకు

# ఫిజియోథెరపీ వరం




ఫిజియోథెరపీ.. ఏవిధమైన సైడ్ ఎఫెక్ట్ లేని ఒక శారీరక చికిత్స. ఆరోగ్యసంరక్షణలో ఇది ఓ విభాగం. గాయం, అనారోగ్యం, లేదా శస్త్రచికిత్స తర్వాత కదలికలను పునరుద్ధరించడం, నొప్పిని తగ్గించడం వంటి పనితీరు ఫిజియోథెరపీ వల్ల మెరుగుపడుతుంది. నేడు ప్రపంచ ఫిజియోథెరపీ డే సందర్భంగా వైద్యవిధానంలో ఫిజియోథెరపిస్టుల ప్రాముఖ్య తను తెలుపుతూ ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ద్వారకాతిరుమల/తణుకు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మనిషి శారీరక భౌతిక అవయవాలను ఒక క్రమపద్ధతిలో కదిలించేలా ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపర్చడంలో ఫిజియోథెరపిస్టులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. దీనిపై అవగాహన పెంచడానికి ప్రతీ ఏటా సెప్టెంబరు 8న ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. ప్రపంచ ఫిజియోథెరపీ కౌన్సిల్‌ను 1951లో సెప్టెంబరు 8న ఏర్పాటు చేశారు. ఈ రోజునే ప్రతీ ఏడాది ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవంగా వైద్యులు నిర్వహిస్తున్నారు. ఫిజియోథెరపీపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 1996లో ప్రపంచ శారీరక చికిత్స సమాఖ్య ఈ దినోత్సవాన్ని పారంభించింది.

### ఫిజియోథెరపీ అంటే..

ప్రస్తుతం ఫిజియోథెరపీకి డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. పుట్టుకలో వచ్చే లోపాలు, ప్రమాదాలు, అనారోగ్యం కారణంగా శారీరకంగా, మానసికంగా కుంగే వారికి ఫిజియోథెరపీ ఒక వరం. సర్జరీ ఏదైనా సక్సెస్‌లో 50శాతం ఫిజియోథెరపీపై ఆధారపడాల్సిందే. అనారోగ్యం, గాయం, శస్త్రచికిత్స తర్వాత శారీరక విధులను పునరుద్ధరించేంది ఈ ఫిజియోథెరపీ మాత్రమే. ఎలాంటి మందుల ప్రమేయం లేకుండా తల మొదలు అరికాలు వరకు నొప్పిని తగ్గించడం, వ్యాయామంతో కండరాలు. కీళ్ల, నరాల సామర్థ్యాన్ని ఈ ఫిజియోథెరపీ ద్వారా పెంచుకోవచ్చు.

### చికిత్స విధానం ఇలా..

ఫిజియోథెరపిస్టులు తమ చికిత్సలో భాగంగా వ్యాయామచికిత్స, మాన్యువల్ థెరపీ, ఎలక్ట్రికల్ స్టిమ్యులేషన్, మసాజ్ వంటి పద్ధతులను ఉపయోగిస్తారు. శరీరంలో ఏదైనా ఎముక, విరిగినా.. కండరం పట్టేసినా శస్త్రచికిత్స అనంతరం గాయమైన కండరం, ఎముక సాధారణ స్థితికి చేరుకునేందుకు వైద్యులు ఫిజియోథెరపీని రిఫర్ చేస్తారు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పక్షవాత రోగులకు దీన్ని దశలవారీగా వ్యాధి తీవ్రతకు అనుగుణంగా చికిత్సను అందిస్తామని ఫిజియోథెరపిస్టులు చెబుతున్నారు. హెల్తీ లైఫ్‌ను, ఫిట్‌నెస్‌ను ఆస్వాదించాలంటే ఫిజియోథెరపీ ఏకైక మార్గమని చెబుతున్నారు.

### ఫిజియోథెరపీ డే-2025 థీమ్..

ఆరోగ్యకరమైన వృద్ధాప్యం. ఈ థీమ్ వృద్ధులలో బలహీనత, తూలి పడిపోవడాన్ని నివారించడంలో ఫిజియోథెరపీ, శారీరక శ్రమల పాత్రను వెల్లడిస్తుంది. ఫిజియోథెరపిస్టులు పోషించే కీలక పాత్రను ఈ థీమ్ బలపరుస్తుంది.

### సైడ్ ఎఫెక్ట్ లేని వైద్యం



ఫిజియోథెరపీతో స్పాండిలైటిస్, ఫ్రోజెన్ షోల్డర్, టెన్నిస్ ఎల్బో, తదితర ఇబ్బందుల నుంచి ఉపశయనం పొందొచ్చు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఫోన్లు, కంప్యూటర్ల వాడకం వల్ల భుజాలు, మెడ, నడుము నొప్పులతో బాధపడుతున్నారు. ఇటువంటి వారికి మందుల వాడకం వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్ బాధలేకుండా ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగకరం.

- డాక్టర్ భవ్యచంద్, విర్ద్ ఆసుపత్రి ప్రధాన వైద్యుడు, ద్వారకాతిరుమల.

### ఈ వృత్తిలో సహనం, ఓర్పు అవసరం



శారీరక సమస్యలతో ఫిజియోథెరపీ వైద్యం కోసం వచ్చే రోగుల పట్ల ఎంతో సహనం, ఓర్పు కలిగి వుండాలి. ఈ వృత్తి మానవ సంబంధాల శక్తిని నేర్పుతుంది. ప్రతీ కదలిక, తగ్గించబడిన నొప్పి వెనక రోగికి మాత్రమే కాకుండా వైద్యులకు కూడా అవసరంగా గుర్తించాలి.

-డాక్టర్ గెల్లా కావ్య, వెంకటరమణ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆసుపత్రి, అలంపురం.

## ఉపాధ్యాయ ఉద్యోగాలకు వినికిడి అంకెల టాంపరింగ్ !

» ధ్రువపత్రాల్లో దిద్దివేతలపై జిల్లా విద్యాశాఖ ఫిర్యాదు

» విచారణ చేపట్టిన గుంటూరు జీజీహెచ్ వైద్యనిపుణుల కమిటీ

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్‌లో దివ్యాంగుల అంగవైకల్యశాతాన్ని నిర్ధారిస్తూ జారీచేసిన సర్టిఫికెట్లను టాంపరింగ్ చేసినట్టు ధ్రువపడింది. ఈ మేరకు తమ దృష్టికివచ్చిన పీహెచ్ ధ్రువపత్రాలపై సందేహం వ్యక్తంచేస్తూ కొద్దిరోజులక్రితం పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులదృష్టికి జిల్లా విద్యాశాఖ తీసుకెళ్లడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై గుంటూరు జీజీహెచ్‌లో విచారణ జరుగుతున్నట్టు సమాచారం. సర్టిఫికెట్ల ట్యాంపరింగ్ ఎక్కడ జరిగింది, ధ్రువపత్రాల్లో వైకల్యశాతాన్ని మార్చివేసిన ఆనవాళ్లు, బాధ్యులె వరు, తదితర అంశాలపై విచారణ కమిటీ సోమవారం నివేదిక ఇవ్వనున్నట్టు సమాచారం.

డీఎస్సీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సెలక్షన్ జోన్ పరిశీలనకు వచ్చిన అభ్యర్థులకు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైనవారిలో ఫిజికల్లీ హ్యాండీకాప్డ్ అభ్యర్థులు వైకల్యశాతాన్ని నిర్ధారిస్తూ మెడికల్ బోర్డు జారీచేసే ధ్రువపత్రాలను తీసుకుని సమర్పించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆరుగురు దివ్యాంగ (వినికిడి లోపం) అభ్యర్థులను గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ బోర్డుకు ఇటీవల జిల్లా విద్యాశాఖ పంపగా, అక్కడ జారీ చేసిన సర్టిఫికెట్లలో కొన్నింటిపై వైకల్యశాతాన్ని నిర్ధారించే అంకెల్లో దిద్దివేతలు/మార్పులు చేర్పులు చోటు చేసుకున్నట్టు గమనించారు. ఇదే విషయాన్ని కొద్దిరోజుల వ్యవధిలోనే విద్యాశాఖ ఉన్నతాధికారులు అన్నిజిల్లాల విద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో చెప్పినట్టు తెలిసింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు గుంటూరు జీజీహెచ్ మెడికల్ బోర్డు జారీ చేసిన వినికిడిలోపం అభ్యర్థుల ధ్రువపత్రాలను ఏలూరు జీజీహెచ్ మెడికల్ బోర్డుతో రీవెరిఫికేషన్/రీఅసెస్‌మెంట్ చేయించాలని ఆదేశించారు. మొత్తం ముగ్గురు వైద్య నిపుణులతో కూడిన మెడికల్ బోర్డు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సంబంధిత తొలుత అభ్యర్థులకు ఆడియోమెట్రీ టెస్టులు చేసి, వారికి గుంటూరు జీజీహెచ్ మెడికల్‌బోర్డు జారీచేసిన వైకల్యశాతాన్ని తిరస్కరించింది. మొత్తం నలుగురు అభ్యర్థులకు జారీచేసిన ధ్రువపత్రాలపై జరిపిన రీవెరిఫికేషన్/రీఅసెస్‌మెంట్‌లో ఇద్దరికి ఆడియోమెట్రీ టెస్టుల్లో సంబంధించిన వినికిడిలోపం(హెచ్‌ఐ) నిర్ణీత 50శాతం లేనందున తొలుత ఇచ్చిన సర్టిఫికెట్లను తిరస్కరించినట్టు సమాచారం. మరో ఇద్దరు అభ్యర్థులకు జారీఅయిన సర్టిఫికెట్లలో పేర్కొన్న ప్రకారమే వైకల్యశాతం ఉన్నప్పటికీ ధ్రువపత్రాల్లో ఏమైనా టాంపరింగ్ జరిగిందా, లేదా అనే విషయాలు బయటకు తెలియడంలేదు. కాగా ఆర్థో(శారీరక అంగవైకల్యం) కోటాలో డీఎస్సీకి ఎంపికైన ఒక అభ్యర్థి తనకు అవగాహన లేకపోవడం వల్లే సంబంధిత కోటాలో దరఖాస్తు చేశానని, ఈడబ్ల్యూఎస్ కోటాలో తనకు ఉద్యోగంవచ్చే అవకాశంఉన్నందున ఆర్థో కోటానుంచి తనను తప్పించాలని లిఖితపూర్వకంగా జిల్లా విద్యాశాఖను అభ్యర్థించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక దృష్టిలోపం(వీహెచ్) కోటాలో డీఎస్సీకి ఎంపికైన ఒక మహిళాఅభ్యర్థికి ఏలూరు మెడికల్ బోర్డు జారీచేసిన ధ్రువపత్రంలో పేర్కొన్న వైకల్యశాతంపై రీఅసెస్‌మెంట్ కోసం ఆశ్రం ఆసుపత్రికి శనివారం పంపగా, పునఃపరిశీలన నివేదికను సీల్డ్‌కవర్‌లో పెట్టిఇచ్చినట్టు తెలిసింది.

### బాధ్యులెవరు..?

వినికిడి లోపంవున్న అభ్యర్థులకు జారీచేసిన సర్టిఫికెట్లపై గుంటూరు జీజీహెచ్ మెడికల్ బోర్డు ఒకరికి 26శాతం వైకల్యాన్ని నమోదుచేయగా దానిని 62శాతంగా దిద్దివేశారని, మరొకరికి 35శాతం ఉన్నట్టుగా నిర్ధారిస్తే ఆ అంకెను 65 శాతంగా టాంపరింగ్ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. తమకు అందిన సర్టిఫికెట్లను జిల్లావిద్యాశాఖ అధికారులు, కొందరు ఉద్యోగులు నిశితంగా గమనిస్తే అంకెల టాంపరింగ్ బయటపడింది. గుంటూరు, ఏలూరు జిల్లాల విద్యాశాఖల్లో పనిచేస్తున్నవారికే ఈ టాంపరింగ్ వ్యవహారంలో పాత్ర ఉండ వచ్చని ప్రచారం ఒకటి ఉంది. ఈ రెండు జిల్లాల డీఈవో కార్యాలయాల అధికారులకే బాధ్యతలను ఇచ్చినట్టు సమాచారం. అలాకాకుంటే జీజీహెచ్ స్థాయిలోనే అవకతవకలను తోసిపుచ్చలేమని మరో ప్రచారం ఉంది. ఏదైనా విచారణ కమిటీ నివేదిక, పోలీసు ఎంక్వయిరీల్లోనే అసలు విషయాలు బయటకు వస్తాయని చెబుతున్నారు. డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల నిశిత పరిశీలనను ఇప్పటికీ ఏలూరు డీఈవో కార్యాలయంలో పలుమార్లు కొనసాగిస్తుండడం గమనార్హం.



## పడిపోయిన బెండ ధర

» పెరిగిన తెల్ల వంకాయలు » నిలకడగా మహారాష్ట్ర ఉల్లి ధరలు

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : బెండకాయల ధరలు నేలనంటాయి. గతవారం కిలో రూ.50 ఉన్న బెండకాయలు ఈవారం రూ.20కు పడిపోయాయి. బెండ కాయలు కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. తాడేపల్లిగూడెం మండలంలోని లింగారాయుడుగూడెం, దండగర్ర, జగన్నపేట, వెంకట్రామ న్నగూడెం, కొయ్యలగూడెం, సిద్దాంతం, జీలుగుమిల్లి ప్రాంతాల్లో విస్తారంగా బెండ సాగుచేశారు. ఇక్కడ ఆశాజనకంగా తోటలు కాయలు కాయడంతో వాటిని విక్రయించే సమయానికి ధర పడిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటే బెండ కాయలు త్వరగా పెరిగిపోతాయని రైతులు చెబుతున్నారు. ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పుతో ఎండలు పెరిగాయి. ప్రతిరోజూ కోతకు బెండవచ్చేస్తుంది. ఇబ్బడి ముబ్బడిగా బెండ దిగుమతి కావడంతో వీటిని కొనుగోలు చేయడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదు. దీంతో అయినకాడికి రైతులు అమ్ముకోవాల్సి వస్తుంది. రిటైల్ వ్యాపారులు సైతం కిలో రూ.20కు విక్రయిస్తున్నారంటే పరిస్థితి అర్థమవుతోంది.

● తెల్లవంకాయ ధరమాత్రం అమాంతంగా పెరిగింది. నాణ్యతను బట్టి కిలో రూ.80 నుంచి 100 మధ్య విక్రయాలు జరుగుతున్నాయి. నల్లవంగ కిలో రూ.60కు అమ్మకాలు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు సిద్దాంతం వంటి లంకప్రాంతాల్లో సాగుచేసిన వంగసాగు దెబ్బతింది. మెట్టప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో తెల్లవంగకు డిమాండ్ పెరిగింది. మిగిలిన కూరగాయలు స్థిరంగానే ఉన్నాయి.

### స్థిరంగా మహారాష్ట్ర ఉల్లి..

మహారాష్ట్ర ఉల్లి స్థిరంగానే ఉంది. రూ.100కు నాలుగు కిలోల వంతున ఉల్లిని విక్రయిస్తున్నారు. నాసిరకం ఐదు కిలోల వంతున వంద రూపాయలకు అమ్ముతున్నారు. మొత్తం మీద మహారాష్ట్ర నుంచి వచ్చే పాత ఉల్లి ధరలు స్థిరంగానే ఉన్నాయి.

క్రైం సమాచారం

### రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న రైలు నుంచి ఒక గుర్తుతెలియని యువకుడు జారిపడి ముక్కలు ముక్కలై మరణించాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని దెందులూరు మండలం సీతంపేట గ్రామ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహం ఉన్నట్లు ఆదివారం మధ్యాహ్నం సమాచారం అందింది. రైల్వే హెచ్‌సీ శ్రీనివాస్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గుర్తించడానికి ముఖం లేదు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉండవచ్చని అతడి సెల్‌ఫోన్ ముక్కలై ఉండడంతో దానిని బట్టి గుర్తించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మృతదేహం శరీరభాగాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

### అనుమానంతో భార్యపై కత్తితో దాడి..

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : భార్యపై అనుమానం పెంచుకున్న భర్త మర్రిపూడి లక్ష్మణరావు చర్చిలో ప్రార్థన చేస్తుండగా భార్యపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన తాడేపల్లిగూడెంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. కుటుంబ పోషణ నిమిత్తం భార్య సంగీత విదేశాలకు వెళ్లి వచ్చారు. వచ్చినప్పటి నుంచి భార్యపై అనుమానాన్ని భర్త పెంచుకున్నాడు. ఆదివారం భార్యపై దాడిచేయడంతో స్థానికులంతా భయభ్రాంతులకు గురై అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. భార్య సంగీతను తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమె కంటి దగ్గర, చేతిపై కత్తి గాయాలయ్యాయి. ఏరియా ఆసుపత్రిలో వైద్యులు వైద్యసేవలు అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ బాదం శ్రీను తెలిపారు.

### మద్యం మత్తులో జారిపడిన వ్యక్తి మృతి

ముసునూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన రమణక్కపేటలో ఆదివారం చోటు చేసుకుంది. తోట మురళీకృష్ణ(37) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై నిత్యం తాగుతూనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న అతడు ఆదివారం ఉదయం ఇంటిలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు 108 వాహనంలో నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడికి భార్య ఉంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

## ఒకే ఇంట.. రెండు రోడ్డు ప్రమాదాలు

» సోదరుడికి యాక్సిడెంట్ అయిందని వెళ్తుండగా తమ్ముడిని వెంటాడిన ప్రమాదం



రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు

పెదపాడు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోదరుడికి యాక్సిడెంట్ అయ్యిందనే విషయం తెలుసుకుని చూసేందుకు వెళ్తున్న తమ్ముడు కూడా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వేర్వేరుచోట్ల ఇద్దరు అన్నదమ్ములు రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడడంతో ఆ కుటుంబం ఆందోళన వ్యక్తం చేస్తోంది. విజయవాడకు చెందిన షేక్ జానీకి ఇద్దరు కుమారులు.. వీరిలో చిన్న కుమారుడు షేక్ నసీర్ విజయవాడలో ఫిట్‌నెస్ సెంటర్ నడుపుతున్నాడు. ఈనెల 4న తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకల నిమిత్తం కారులో రాజమండ్రి వెళ్లాడు. ఈలోగా విజయవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్న గాయపడ్డాడని తెలుసుకున్న తమ్ముడు నసీర్ వెంటనే రాజమండ్రి నంచి విజయవాడకు కారులో వస్తుండగా పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్ద ముందు వెళుతున్న ఐషర్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. ఒక వైపు అన్న విజయవాడలో, మరోవైపు తమ్ముడు గుంటూరులో చికిత్స పొందుతున్న నేపథ్యంలో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కట్టా శారదాసతీష్ తెలిపారు.



ఎరువుల దుకాణం తనిఖీల్లో డీఎస్పీ వెంకటేశ్వరావు, అధికారులు

### రూ.2.75 లక్షల విలువైన ఎరువులు సీజ్

ఏలూరు,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా పలు ప్రాంతాల్లోని ఎరువుల దుకాణాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. ఆగిరిపల్లి మండలం గొల్లగూడెంలో హనుమాన్ ఏజన్సీస్, ఎండూరు శ్రీరామ చంద్రమూర్తి, కాళ్ల మండలం బొండాడలో స్వామి అయ్యప్ప ఫెర్టిలైజర్స్ ఫెస్టిసైడ్‌లను, హనుమాన్ ఏజన్సీస్‌లో మొత్తం 2లక్షల75వేల550 విలువ విలువైన 12.650 టన్నుల ఎరువుల వ్యత్యాసం గుర్తించి, వాటిని సీజ్ చేశారు. బిల్లుల లేకుండా 1లక్ష17వే810 విలువైన 3.850 టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేశామని విజిలెన్స్ డీఎస్పీ సింగలూరి వెంకటేశ్వరరావు తెలిపారు. దాడుల్లో సీఐలు శివరామకృష్ణ, ఎస్ఐలు సీహెచ్ రంజిత్‌కుమార్, కె.నాగరాజు, కె.సీతారాములు పాల్గొన్నారు.

### ఉండి మండలంలో '144 సెక్షన్'

» ఆటోతో పోలీసుల హెచ్చరికలు



ఉండిలో ఆటో ప్రచార దృశ్యం

ఉండి, సెప్టెంబరు7 (ఆంధ్ర జ్యోతి): ఉండి మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని పోలీసులు ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు. ఆదివారం ఉదయం ఉండి పోలీస్ స్టేషన్ నుంచి ఆటో ద్వారా ప్రచారం కార్యక్రమం చేపట్టామని తహసీల్దార్ నాగార్జున, ఉండి ఎస్ఐ నజీరుల్లా తెలిపారు. మండలంలోని చెరుకువాడ బ్రాందీషాపు వద్ద ఇటీవల ఇరువర్గాల మధ్య జరిగిన వివాదం కారణంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈమేరకు ఎక్కడా కూడా ఐదుగురికి మించి వ్యక్తులు గుమిగూడి ఉండరాదన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ప్రజలంతా సహకారించాలని కోరారు. అన్ని ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

### రోడ్డుపై బైఠాయించిన వారిపై కేసు నమోదు

బ్రాందీషాపు తొలగించాలని కోరుతూ చెరుకువాడ- అర్తమూరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై శనివారం బైఠాయింపు జరిపి ట్రాఫిక్‌కు కారకులైన వారిపై కేసు నమోదు చేశామని ఉండి పోలీసులు తెలిపారు. ఆదివారం పోలీసులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఏలేటి యేసురాజు, మార్తమ్మలతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

### 10 నుంచి ఉమ్మడి జిల్లా క్రీడా జట్ల ఎంపిక పోటీలు

పెదవేగి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 19 ఏళ్ల విభాగం బాల, బాలికల జిల్లా క్రీడా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తామని స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె.జయరాజు తెలిపారు. ఆసక్తిగల 19 ఏళ్లలోపు క్రీడాకారులు ఆయా క్రీడలకు సంబంధించిన నిర్ధేశించిన విద్యాలయంలో హాజరుకావాలని తెలిపారు. 10న పెదవేగిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో బాల, బాలికలకు ఆర్చరీ, ఫెన్సింగ్, కరాటే, జూడో, షూటింగ్, బాక్సింగ్, రగ్బీ, బీచ్ వాలీబాల్, గట్కా, కురాష్, కలరాయపట్టు, మోడరన్ పెంటాథ్లిన్, తైక్వాండో, తంగాట పోటీలు జరుగుతాయన్నారు. 11న ఫుట్‌బాల్, సెపక్ తక్రా, సైక్లింగ్ రోడ్ అండ్ ట్రాక్, సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్, వాటర్ పోలో, కుస్తీ పోటీలు. అదేరోజున భీమవరం బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో నెట్‌బాల్, మాల్కమ్ పోటీలు. 12న ఏలూరు ఇండోర్ స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్, స్కేటింగ్, సీఆర్‌ఆర్ కళాశాలలో టెన్నిస్, టేబుల్ టెన్నిస్, షటిల్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, ఏఎస్ఆర్ స్టేడియంలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 13న పెదవేగి బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో అథ్లెటిక్స్, సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు 99493 66162 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

## రాట్నాలమ్మ ఆలయం మూసివేత

పెదవేగి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం 2.30గంటల నుంచి శ్రీరాట్నాలమ్మవారి ఆలయం మూసివేసినట్టు ఈవో ఎన్.సతీశ్ కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ అనంతరం తలుపులు తెరిచి, శ్రీరాట్నాలమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని ఆయన వివరించారు.





## వైద్య భగవానుడికి అభిషేకాలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పవరుపేట స్టేషన్ రోడ్డులోని శ్రీధన్వంతరి వైద్య భగవానుడి ఆలయంలో ఆదివారం భక్తులు సామూహికంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అర్చకులు రాళ్ళబండి ఆదినారాయణ శర్మ నుంచి రక్షాబంధనాలు కట్టించుకుని వనమూలికల తీర్థాన్ని స్వీకరించారు. ఆలయ చైర్మన్ కోరాడ రెడ్డి, బూరాడ పూర్ణచంద్రరావు మిత్రబృందం భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.



## విశాఖ స్టీల్ ప్లాంటును పరిరక్షించాలి

ఉంగుటూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని సి.ఐ.టి.యు. జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కైకరంలో సీపీఎం నాయకులు స్వాతంత్ర్య సమరయోధులు రుద్రరాజు సత్యనారాయణరాజు ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. సీనియర్ నాయకుడు గుత్తికొండ వెంకట కృష్ణారావు అధ్యక్షత వహించారు. కైకరం, చేబ్రోలు గ్రామాల్లో నివాళులర్పించారు. కేంద్రం స్టీల్ ప్లాంటును ముక్కలు చేసి ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించిందన్నారు. సీరా అప్పారావు కొర్ని అప్పారావు, పూడి అబ్బులు, సంపంగి శ్రీను, అల్లు గోవిందు, సీరా దుర్గారావు పాల్గొన్నారు.

## రాణినగర్‌లో కబ్జాలు అడ్డుకోవాలని సీపీఎం ధర్నా

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక రాణినగర్ ఏనుగులగుంట భూమి కబ్జా కాకుండా కాపాడి ప్రజల అవసరాలకు ఉపయోగించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం 38, 40 డివిజన్లలో ధర్నా చేశారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న రెండు వేల గజాల స్థలాన్ని కాజేసేందుకు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.ఎన్.వి.డి.ప్రసాద్, ఎ.శ్యామలరాణి, ఎం.ఇస్సాకు, పంపన రవికుమార్, జె.గోపి, అరుణకుమారి, మీసాల సత్యం, యేసుబాబు, సుదర్శన్, నాగ మునికృష్ణ, మంతెన వెంకటేశ్వరరావు, దాసరి రంగారావు, కనకం సత్యనారాయణ, ఎస్.ప్రసాద్, చిలకలపూడి కనకారావు పాల్గొన్నారు.

## వేగవరంలో ప్రశాంతంగా అటవీ శాఖ పరీక్ష



పరీక్షా కేంద్రం వద్ద పోలీసుల బందోబస్త్

దెందులూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించిన అటవీ శాఖలో బీట్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ల ఉద్యోగాలకు జరిగే పరీక్షలు వేగవరంలో ప్రశాంతంగా జరిగాయి. భారీ పోలీసు భద్రతతో అన్ని ఏర్పాట్లు పకబ్బందీగా చేయడంతో మండలంలోని గోపన్నపాలెం శివారు వేగవరం హేలాపూరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆఫ్ సైన్సెస్‌లో జరిగిన అటవీ శాఖ పరీక్షలో 600 మందికి గాను 481 మంది పరీక్షలు రాశారు. తహసీల్దార్ సుమతి, డిప్యూటీ తహసీల్దార్ అంతర్వేది శ్రీనివాసరావులు, అధికారులు ప్రిన్సిపాల్ లావణ్య పర్యవేక్షించారు.

## సాగిపాడులో ఉద్రిక్తత

కామవరపుకోట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం సాగిపాడు పంచాయతీలోని రత్నగిరినగర్‌లో శనివారం రాత్రి కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో డ్రెయినేజీల కోసం ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టారు. సాగిపాడు పంచాయతీ కార్యదర్శి బాణావతు బాలాజీ, రెవెన్యూ పరిపాలన అధికారి కె.వెంకన్నబాబులు మాట్లాడుతూ గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు నివాసాలకు చేరువలో మురుగు నిల్వ ఉండకుండా డ్రెయినేజీలను తవ్వించేందుకు ఆక్రమణల తొలగింపు ప్రారంభించామనడంతో వివాదం సద్దుమణిగింది. సర్పంచ్ గుండుగొలను సుబ్బారావు,కూటమి నాయకులు అబ్బూరి సత్యనారాయణ, ఘంటా చిన్నయ్య, మురళీ, రాంబాబు, దుర్గారావు పాల్గొన్నారు.

## ఫొటో, వీడియోగ్రాఫర్లు ఐక్యంగా ఉండాలి



దాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫొటో, వీడి యోగ్రాఫర్లు ఐక్యంగా ఉంటూ సంఘ అభివృద్ధికి అహర్నిశలూ కృషి చేయాలని మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి అన్నారు. ద్వారకాతిరుమలలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఏలూరు జిల్లా ఫొటో వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకా రోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్ర సంక్షేమ సంఘ చైర్మన్ మాదాల రమేశ్, అధ్యక్షుడు ఎం.నాగరాజు పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న సభ్యులు ముందుగా కెమేరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం 2025 నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవాధ్య క్షుడిగా ఎస్ఎంఆర్ పెదబాబు, యు.ప్రసాద్, పిల్లి బ్రహ్మంను ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా తాడేపల్లిగూడేనికి చెందిన ఎం.రామును అధ్యక్షులుగా కె.వి.రమణారావు, కార్యదర్శిగా ప్రదీప్ కుమార్‌ను ఎన్నుకున్నారు.

## అంబికాదేవికి అభిషేకాలు



ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం సత్రంపాడులోని శ్రీఅంబికాదేవి ఆలయంలో అమ్మవారికి ఆలయ ప్రధానార్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులిచ్చి భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవాలయాన్ని మూసివేశారు. సోమవారం ఉదయం తెరిచి సంప్రోక్షణ నిర్వహిస్తామని అర్చకులు రాఘవేంద్రశర్మ తెలియజేశారు.

## ఘనంగా గణేశ్ నిమజ్జనాలు



ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక రామచంద్రరావుపేట జీవీ మాల్ సమీపంలో గత నెల 27న ప్రారంభమైన గణేశ్ ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో ఆదివారం గణనాథుడిని భారీ విగ్రహాన్ని క్రెయిన్ ద్వారా ట్రాక్టర్ మీదకు ఎక్కించి మేళతాళాలు, బాజా భజంత్రీలు, వసంతోత్సవాల నడుమ జరిగే ర్యాలీని నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ప్రారంభించారు. నగరంలోని వివిధ కూడళ్లల్లో గణేశ్ ఉత్సవాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో భక్తి భావాలు పెరుగుతున్నాయని, తద్వారా శాంతి నెలకొంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఫ్రూట్స్ షాపు నాని, కూటమి నాయకులు పాల్గొన్నారు. కేరళ వాయిద్యాలతో ర్యాలీ నిమజ్జనానికి కొనసాగింది.

### ఘనంగా అన్నప్రసాద వితరణ..

ఎస్ఆర్‌పేటలోని వినాయకచవితి ఉత్సవాల మండపాన్ని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆదివారం దర్శించుకుని అనంతరం అన్నసమారాధన ప్రారంభించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జి ఆర్.ఎన్.ఆర్.నాగేశ్వరరావు, టీఎన్‌టీయూసీ నాయకులు కోలపల్లి ఉమాశంకర్, డివిజన్ నాయకులు పాతాళ వేణు, సాయి, చలపతిరావు, బాలాజీ, నవీన్, రామలక్ష్మణ్, అశోక్, శ్రీను ఉన్నారు.

## దానగూడెం ఘటనలో ఏడుగురి అరెస్టు

(5వ పేజీ తరువాయి)

అనుమతులు నిరాకరించారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కరకట్ట, దానగూడెం గ్రామానికి చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైన అనుమానాస్పదమైన వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కైకలూరు బైపాస్‌రోడ్డు చిన్నచెరువుగట్టు వద్ద, కరకట్ట ఆంజనేయ స్వామి గుడివద్ద పోలీసు పికెట్‌లను ఏర్పాటు చేశారు. కైకలూరు టౌన్ సీఐ కృష్ణ, రూరల్ సీఐ రవికుమార్ పర్యవేక్షణలో గస్తీ నిర్వహిస్తున్నారు. కైకలూరులో ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉంది.

## స్వల్ప పెనాల్టీతో.. గట్టెక్కారు!

(5వ పేజీ తరువాయి)

ఒక శాతం సర్వీసు చార్జీని పొగాకు నిధికి చెల్లించాల్సి ఉంటుంది.

- బ్యారన్ కోటాలో పది నుంచి ఇరవై శాతం వరకు కిలోకు రూ.1 చొప్పున పెనాల్టీ,అమ్మకాల విలువపై 2 శాతం, సాధారణ సర్వీసు చార్జీ ఒకశాతం మొత్తం 3 శాతం సర్వీసు చార్జీలు వసూలు చేస్తారు. 20 శాతం కంటే ఎక్కువగా ఉన్న పొగాకుకు కిలో పొగాకుకు రూ.1 పెనాల్టీతో పాటు, అమ్మకాల విలువపై 3 శాతం, సాదారణ సర్వీసు చార్జీ ఒక శాతం మొత్తం 4శాతం వసూలు చేస్తారు.

# అతిగా వాడితే అనర్థమే

**రైతులకు అధికారుల అవగాహన - అవసరం మేరకే తీసుకెళ్లాలని సూచనలు**



పెదపాడులో యూరియాను పరిశీలిస్తున్న దృశ్యం

పెదవేగి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): యూరియా అతిగా వాడితే అనర్థమేనని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. రైతులు యూరియాను పరిమితికి మించి వినియోగిస్తున్నారని, యూరియా అధిక మోతాదులో వాడితే నష్టమే తప్ప లాభం ఉండదన్నారు. పెదవేగి మండలం పెదకడిమిలోని కొప్పాక సొసైటీ గొడౌన్‌ను ఆదివారం తనిఖీ చేసిన ఆయన యూరియా తీసుకెళ్తున్న రైతులతో మాట్లాడారు. రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు తక్షణమే యూరియా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెదవేగి మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

- పోలవరం: యూరియా మితంగా వాడి భూసారం కాపాడాలని మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు అన్నారు. ఆదివారం పోలవరం మండలంలో కృష్ణారావుపేట, పట్టిసీమ, గూటాల, ప్రగడపల్లి సొసైటీలకు 50.46 టన్నుల యూరియా వచ్చిందన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ యూరియా అవసరం ఉన్న రైతులు ఆధార్ కార్డుతో వచ్చి అవసరానికి సరిపడా మాత్రమే యూరియా తీసుకెళ్లాలన్నారు. నానో యూరియా వాడినా మంచి ప్రయోజనం ఉంటుందన్నారు.వ్యవసాయాధికారి, తహసీల్దారు సొసైటీల సీఈవోలకు సేల్స్‌మన్ లకు పలు సూచనలు చేశారు. తహసీల్దారు బి.సాయి రాజు, సొసైటీ అధ్యక్షులు కొణతాల ప్రసాద్, నునకాని రాంబాబు పాల్గొన్నారు.
- పెదపాడు: యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారంటూ కొన్ని పత్రికలు అసత్య కథనాలను ప్రచురిస్తున్నాయని, దీనిని రైతులంతా ఖండిస్తున్నారని పెదపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గారపాటి స్టాలిన్, పెదపాడు నీటి సంఘం అధ్యక్షులు బొప్పూడి కాశీబాబులు అన్నారు. పెదపాడు సొసైటీ వద్ద జరుగుతున్న యూరియా పంపిణీని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహకారంతో పెదపాడు సొసైటీ ద్వారా ఇప్పటి వరకూ 230 మెట్రిక్ టన్నుల యూరియాను రైతుల అవసరాల మేరకు అందించామన్నారు. సొసైటీ సీఈవో డి.వి.సుబ్బారావు ఉన్నారు. పెదపాడు సొసైటీలో జరుగుతున్న యూరియా పంపిణీని వ్యవసాయ శాఖ ఏవో షేక్ ఇమామ్ ఖాసీం ఆదివారం పరిశీలించి, రికార్డులు, స్టాకు పరిశీలించి రైతులతో మాట్లాడారు. మూడవ దఫా యూరియా కూడా రైతులకు అందించడం జరిగిందన్నారు



పోలవరంలో పరిశీలిస్తున్న అధికారులు

## అంకితభావంతో పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు



ఉపాధ్యాయుడు తేర ప్రసాద్‌ని సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి):దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగి మండలం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం కలెక్టరేట్ గోదావరి ఫంక్షన్ హాల్లో మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఎంఈవో 1 బి.త్రిపుర సుందరీదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. ఎంఈవో 2 వి.అరుణ్‌కుమార్ మాట్లాడు తూ మండలంలోని ఉన్న అన్ని పాఠశాలలు ఉత్తమ విద్యాలయాలుగా నిలపడానికి ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ఏలూరు జిల్లా ప్రధాన ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు వడ్లపట్ల మురళి, ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షులు పరసా నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాల దీటుగా పనిచేస్తున్నాయన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం..

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని, విద్యార్థి భవిష్యత్, జాతి నిర్మాణం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని ఏలూరు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఆదివారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తేరా ప్రసాద్, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన డీఎస్ ప్రకాశరావులతో పాటు మరో 9 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో వెన్న శ్రీలత,ఎంఈవోలు రవిప్రకాశ్, అరుణ్ కుమార్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు, బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు, స్టీవెన్, జి.మోహనరావు పాల్గొన్నారు.



మనోహర్ మాస్టారును సన్మానిస్తున్న దృశ్యం

## వ్యాయామ విద్యకు వన్నె తెచ్చిన మనోహర్

దెందులూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గోపన్నపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేసిన డాక్టర్ మరీదు మనోహర్ ఉద్యోగ విరమణ చేశారు. ఆదివారం ఏలూరులోని శరణ్ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ మండపంలో ఉద్యోగ విరమణ సన్మాన సభ ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి మాసగిరి శ్రీనివాసరావు, గౌడ్ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు చలమోలు అశోక్ గౌడ్, ఉపాధ్యాయులు మాట్లాడుతూ రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో మనోహర్ సేవలందించడం ద్వారా డాక్టరేట్ పొందారని అన్నారు. మనోహర్, సత్య దంపతులను భారీ గజమాలతో ఘనంగా సన్మానించారు. దుర్గా ఫైనాన్స్ సంస్థల అధినేత మల్లికార్జునరావు, వీరంకి చిరంజీవి, అవిర్నేని శ్రీధర్ పాల్గొన్నారు.

## స్వామి అనుగ్రహం అందరికీ ఉండాలి

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీవిఘ్నేశ్వరస్వామి అనుగ్రహం లోకమంతా మెండుగా ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. టీడీకాలనీలో ఉన్న విఘ్నేశ్వర ఆలయాన్ని ఆయన సందర్శించారు. వినాయక చవితి మహోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజ నిర్వహించారు. కార్పొరేటర్ తంగిరాల అరుణాసురేశ్, ఇడా చైర్మన్ శివప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు, ఆలయ కమిటీసభ్యులు ఎస్.ప్రభాకర్, లేళ్ల జోజి, నరసింగ్ పాల్గొన్నారు. జీవీ మాల్ సెంటర్‌లో ఫ్రూట్స్ షాపుల ఆధ్వర్యంలో జరిగిన వినాయక చవితి ముగింపు ఉత్సవాల్లో నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటి

## ఉత్సాహంగా పాటల పోటీలు

ఏలూరు రూరల్, సెప్టెంబర్ 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్‌పీఎస్ వాసు ఆధ్వర్యంలో వైఎంహెచ్ఏ ప్రాంగణంలో పాటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కళాకారులు పాటలు పాడి అలరించారు. జూనియర్స్ విభాగంలో వైనాగసంహిత (ప్రథమ), ఎల్ శాశ్విత్ (ద్వితీయ), శ్రీనిధి(తృతీయ) స్థానం సాధించారు. సీనియర్స్ విభాగంలో ఎం.నిరేష(ప్రథమ), ఎం.సాయి శ్రీలాస్య(ద్వితీయ), సి.హెచ్.రాజేశ్ (తృతీయ) స్థానంలో నిలిచారు. అకాడమీ డైరెక్టర్ వహీదా వాసు పర్యవేక్షించారు.



నిరసన తెలియజేస్తున్న అలుగు ఆనందశేఖర్

## దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలం దానగూడెం గ్రామానికి చెందిన దళితులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని విద్యావేత్త అలుగు ఆనందశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అందుగుల ఫ్రాన్సిస్ అధ్యక్షతన స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అలుగు ఆనంద శేఖర్ మాట్లాడుతూ దానగూడెం గ్రామంలో జిల్లా కలెక్టర్, ఎస్సీ కమిషన్ పర్యటించి 144 సెక్షన్ ఎత్తివేసి శాంతి భద్రతలు కాపాడాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు నాయకుడు తెర్లపాటి శ్రీనివాస్, బీఎస్పీ నాయకుడు కలపాల రాజ్‌కుమార్, ఎం.కిరణ్ పాల్గొన్నారు.

# పారదర్శకంగా నిత్యావసరాల పంపిణీ


**స్మార్ట్ కార్డుల పంపిణీలో అధికారులు**



చింతలపూడిలో పంపిణీ చేస్తున్న నాయకులు

లింగపాలెం, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): నిత్యావసరాల పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధునాతన టెక్నాలజీతో ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను లింగపాలెం మండలంలో కూటమి నాయకులు అధికారులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. మండలాధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు, చింతలపూడి నియోజకవర్గ రైతు అధ్యక్షుడు మోరంపూడి మల్లికార్జునరావు మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలను అరికట్టడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు తెలిపారు. తాతిన రాధాకృష్ణ, అనిలేటి అజయ్ పాల్గొన్నారు.

- చింతలపూడి: నగర పంచాయతీలోని పాత చింతలపూడి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐ.టీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు అనీశ్ కుమార్ మాట్లాడుతూ ఏటీఎం కార్డులను స్మార్ట్ రేషన్ కార్డులలో కుటుంబ సభ్యుల వివరాలు ఉండేలా కూటమి ప్రభుత్వం చేర్చిందని, క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే గత ఆరు నెలలుగా తీసుకున్న రేషన్ వివరాలు కనిపిస్తాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించారన్నారు. బూత్ కన్వీనర్ ముళ్ళగిరి అచ్చయ్య, సాగర్, నాగేంద్ర, సురేంద్ర పాల్గొన్నారు.
- కామవరపుకోట: మండలంలోని ఆడమిల్లి గ్రామంలో సర్పంచ్ గూడపాటి కేశవరావు, టీడీపీ బీసీ సెల్ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు జిజ్జూరి బాబ్జి, మిత్రబృందం ఆదివారం ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. రేషన్ పంపిణీలో అవకతవకలు నిర్మూలించేందుకు అందరికీ సకాలంలో రేషన్ అందజేసేందుకు ఈ రేషన్ కార్డులను మరే రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతమనేని

## ప్రజా సమస్యల పరిష్కారమే అజెండా

పెదవేగి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ అజెండా అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఆదివారం పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజా సమస్యలు తెలుసుకుని మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండింటిని సమతూకంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ఇటు వ్యవసాయం, అటు సాంకేతిక రంగాన్ని సమానంగా అభివృద్ధి పథాన నిలపడంలో కూటమి ప్రభుత్వం సఫలీకృతమైందని ప్రభాకర్ పేర్కొన్నారు.

# 'ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయండి'

బుట్టాయగూడెం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా మరో ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం మర్రిగూడెంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు కొమరం వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరగ్గా జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో ఏలూరు జిల్లా ఏజెన్సీ ఆదివాసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాన్ని మైదాన ప్రాంత జిల్లాలతో కలపడం వలన ఏజెన్సీ చట్టాలు అమలు కావడం లేదన్నారు. చంద్రబాబు నాయుడు తాను అధికారంలోకి వస్తే రంపచోడవరం కేంద్రంగా మరో ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని, పరిపాలన సౌలభ్యం నిమిత్తం, మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాతో పాటు రంపచోడవరం కేంద్రంగా మరో జిల్లాను ఏర్పాటు చేసి పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాలను, పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాలను అందులో కలపాలని డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులు తెల్లం రాములు, తెల్లం గంగరాజు, కోర్స నాగేశ్వరరావు, కుంజా రమేశ్, తెల్లం లక్ష్మణరావు, రవ్వా బసవరాజు, పొడియం కొవ్వాడయ్య, కోర్స తులసీరావు, రాంబాబు, తెల్లం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

## ఉత్సాహంగా చెస్ పోటీలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి):చెస్ అసోసియేషన్ ఆఫ్ హేలాపురి, హేలాపురి ఎలైట్ లైన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామచంద్రరావుపేటలోని ఏలూరు పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో జిల్లా అండర్ 15చెస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలను రిటైర్డ్ విద్యాశాఖ ఏడీ ఎస్వీఎస్ వరదాచారి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగం క్రీడతో మేధస్సు పెరుగుతుందన్నారు. విజేతలకు ప్రశంసా పత్రాలను, పాఠశాల ఏజీఎం కృష్ణ అందించారు. టాప్ ఫైవ్‌లో అనురూప్ మోషే(ప్రథమ), ఎం.విక్రాంత్(ద్వితీయ), సి.హెచ్.మోక్షజ్ఞ(తృతీయ) స్థానం సాధించారు. ఎం.ఆశీష్ పాల్, ఎం.ఆశ్రమబెన్నీ, 4,5 స్థానాలు సాధించారు. 7, 8,9 ఏజ్ గ్రూపుల్లో వృద్విక, మోక్షిత్, జి.చేతన్, జన్మశ్రీ, అఖిలేష్, టి.అజయ్, జయరాం, వీక్షిత గెలుపొందారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.యోహనన్, జి.అరుణ పర్యవేక్షించారు.



ప్రశంసా పత్రాలతో చిన్నారులు





సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

## విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ

ఏలూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు నడవాలని ఏఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు అన్నారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై మెగా ట్రైనింగ్ కార్యక్రమం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్, ఐసీఐ ఏలూరు హైమావతి క్లబ్ అధ్యక్షుడు ఎంఎల్ నరసింహరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆత్మ విశ్వాసంతోనే పరీక్షల్లో విజయం సాధించవచ్చన్నారు.

## ఉచిత హోమియో వైద్య శిబిరం

పోలవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ శ్రీరామకృష్ణ గీతాశ్రమంలో ఆదివారం రాజమహేంద్రవరం జగద్గురు పీఠం ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి పైగా ఉచిత వైద్య సేవలు పొందినట్లు ఆశ్రమ నిర్వాహకురాలు నందుల స్వరాజ్యలక్ష్మి తెలిపారు. విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నదాత పోరుకు తరలిరండి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న తలపెట్టిన 'అన్నదాత పోరు'కు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయం చేయాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం ఏలూరు పార్టీ కార్యాలయంలో ఈ మేరకు 'అన్నదాత పోరు' పోస్టర్లును ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం వైఫల్యం వల్ల రైతులకు తీరని అన్యాయం జరుగుబోతోందన్నారు.

### జంగారెడ్డిగూడెం పరిధిలో..

టి.నర్సాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయం వద్ద ఈ నెల 9న జరిగే రైతు పోరును జయప్రదం చేయాలని వైసీపీ రైతు విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధుసూదనరావు ఆదివారం కోరారు. వైసీపీ అధినేత జగన్ పిలుపు మేరకు రైతుపోరు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆర్‌బీకేలను పునరుద్ధరించాలని, రైతులకు సరైన ధరలకు మెన్యూర్స్ అందించాలన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుడివాక లంక సబ్ స్టేషన్ పరిధిలో క్రొత్త లైన్ ఏర్పాటు నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు కొక్కిరాయిలంక, పైడి చింతప్పాడు, ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేద్కర్ తెలిపారు.

### బాదంపూడి రూరల్ ఫీడర్ పరిధిలో..

ఉంగుటూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): బాదంపూడి రూరల్ ఫీడర్‌కు సోమవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఈ.ఈ. కే.ఎం.అంబేడ్కర్ తెలిపారు. రావులపర్రు, రాచూరు, సీతారాంపురం గ్రామాల చేపల చెర్వులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

### కొయ్యలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో..

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 7(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం సబ్‌స్టేషన్ నుంచి కన్నాపురం, కన్నాయిగూడెం ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు జంగారెడ్డిగూడెం ట్రాన్స్‌కో ఏఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అచ్యుతాపురం, రేపల్లెవాడ, కొయ్యలగూడెం పట్టణంలోని అశోక్‌నగర్, కన్నాపురంరోడ్డు, అంకాలగూడెం గ్రామాల్లో విద్యుత్ ఉండదన్నారు.

## రేపు ఏపీ ఎన్‌జీవో కమిటీ ఎన్నిక

కొయ్యలగూడెం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీవో కొయ్యలగూడెం మండల ఎన్నికలు మంగళవారం జరుగుతాయని కార్యదర్శి స్వామి తెలిపారు. మండల పరిషత్ సమావేశ హాలులో ఈ ఎన్నికలు జరుగతాయని ఎన్నికల అధికారిగా జంగారెడ్డిగూడెం తాలూక యూనిట్ అధ్యక్షుడు వై.నరేశ్ హాజరవుతారని తెలిపారు. కావున మండలంలో గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 7(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. మండలంలోని యర్రంపేట గ్రామ శివారుల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అరెస్టు చేసి రూ.2500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్.ఐ. చంద్రశేఖర్ తెలిపారు.

## సారా స్థావరాలపై దాడి

కుక్కునూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రాలోని వేలేరు, తెలంగాణలోని భూర్గంపహాడ్ సరిహద్దుల్లోని కిన్నెరసాని వాగు సమీపంలో ఉన్న సారా స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడి జరిపారు. మూడు సారా బట్టీల్లో ఉన్న సామగ్రి, 8 డ్రమ్ముల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా సరఫరా చేసే ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కుక్కునూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కుక్కునూరు సీఐ రమేశ్‌బాబు, ఎస్.ఐ. రాజారెడ్డి పాల్గొన్నారు.

## కోడి పందేలపై దాడి

టి.నర్సాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కోడిపందాలు నిర్వహిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్.ఐ. జయబాబు తెలిపారు. బండివారిగూడెం శివారులోని సీతంపేట గ్రామ శివారుల్లో కోడిపందాలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఆదివారం దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి 2,500 నగదు, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## నేడు తోటపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ఆగిరిపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గన్నవరం క్రాస్ గాస్పెల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో తోటపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బ్రదర్ జాన్ సునీల్ తెలిపారు. సోమవారం తోటపల్లి ఎంఎం చర్చి వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అన్ని వ్యాధులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి

నూజివీడు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని కోరుతూ కోర్ కమిటీ సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా జేఏసీ గౌరవాధ్యక్షుడు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ మంత్రివర్గ త్రిసభ్య కమిటీ మెంబర్ అయిన నాదెండ్ల మనోహర్‌కు సోమవారం వినతిపత్రం ఇవ్వాలని నూజివీడు సాధన సమితి జేఏసీ నిర్ణయించిందన్నారు. జేఏసీ అధ్యక్షుడు మరీదు శివరామకృష్ణ, ట్రెజరర్ చాట్ల పుల్లారావు, నాయకులు సునీల్‌కుమార్, యర్రంశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

# నూజివీడు పుర పాలకంలో.. పెరగనున్న వార్డుల సంఖ్య

### స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆసక్తికర చర్చలు



నూజివీడు పురపాలక కార్యాలయం

(నూజివీడు - ఆంధ్రజ్యోతి)

స్థానిక సంస్థల ఎన్నికలను వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించటానికి సన్నాహాలు చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆయా శాఖల అధికారులకు రాతపూర్వకంగా తెలపడంతో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగినట్టు అయింది. దీంతో నూజివీడు పట్టణంలో మున్సిపల్ రాజకీయాలపై ఆసక్తికర చర్చలు ప్రారంభమయ్యాయి. నూజివీడు పట్టణం సీఆర్‌డీఏ పరిధిలో ఉంది. ఇప్పటివరకు నూజివీడు పురపాలకం బి-గ్రేడ్ మున్సిపాల్టీ పరిధిలో ఉంది. కొన్నేళ్లుగా నూజివీడు పట్టణానికి అత్యంత సమీపంలో ఉన్న పోతురెడ్డిపల్లి, తుక్కులూరు, రామన్నగూడెం, అన్నవరం, యనమదల గ్రామాలను నూజివీడు పట్టణంలో విలీనం చేసే ప్రతిపాదన పెండింగ్‌లో ఉంది. నూజివీడు పట్టణం ప్రస్తుతం 32 వార్డులతో బి-గ్రేడ్‌లో ఉంది.

నూజివీడు పట్టణంలో పై గ్రామాలు విలీనం అయితే ఆరు నుంచి ఏడు వార్డులు పెరుగుతాయి. ఒకవేళ ఈసారి కూడా విలీనం ప్రతిపాదన అమలుకాకపోతే పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు మోడల్ కాలనీ మాత్రం ఖచ్చితంగా జనాభా రీత్యా రెండు వార్డులుగా విభజించటం ఖాయమని సమాచారం. దీంతో వార్డుల సంఖ్య 33 అవుతుంది. ఒకవేళ పై గ్రామాలు కూడా విలీనం అయితే వార్డుల సంఖ్య 39 లేదా 40 వార్డులు కావడం ఖాయం. నూజివీడు పట్టణాన్ని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతానని నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కె.పార్థసారథి ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. పట్టణంలో అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు కావాలంటే ఏ-గ్రేడ్ మున్సిపాల్టీలోకి నూజివీడు వెళితే నిధులు మంజూరు సులభతరం అవుతుంది. పై గ్రామాలు విలీనమైతే నూజివీడు పురపాలకం ఏ-గ్రేడ్‌లోకి వెళ్ళటం ఖాయం. దీంతో రాష్ట్ర నిధులతో పాటు కేంద్ర ప్రభుత్వం నిధులు కూడా నూజివీడు పట్టణానికి అందుతాయి. నూజివీడు ప్రస్తుత జనాభా 82 వేలు, ఓటర్ల సంఖ్య 40,672గా ఉంది. గ్రామాలు విలీనం అయితే జనాభా సంఖ్య లక్ష దాటుతుంది. ఓటర్ల సంఖ్య 55 వేలు దాటుతుందని సమాచారం.

**ప్రాదేశికంగా మూడు గ్రామాలు నూజివీడులో...**

నూజివీడు మున్సిపల్ పరిధిని క్రమంగా విస్తరిస్తూ ఇప్పటికే ప్రాదేశికంగా దాదాపు మూడు గ్రామాలు నూజివీడు మున్సిపాల్టీలో కలిసి ఉన్నట్టు చెప్పవచ్చు. ఎమ్మార్ అప్పారావు కాలనీలో టిడ్కో గృహాల నిర్మాణంతో పోతురెడ్డిపల్లి గ్రామం కొంతభాగం నూజివీడు మున్సిపల్ పరిధిలోకి వచ్చినట్టే. అదే విధంగా జగనన్న కాలనీల ఏర్పాటుతో అన్నవరంలో కొంత మున్సిపల్ పరిధిలోకి వచ్చింది. ఇక తుక్కులూరు కూడా నూజివీడులో కలిసే ఉంటోంది. ఈ విధంగా ప్రాదేశికంగా ఈ మూడు గ్రామాలు నూజివీడు మున్సిపల్ పరిధిలో కలిసిపోయే కనిపిస్తున్నాయి. అయితే యనమదల గ్రామంలోని శివారు గ్రామమైన రేగుంట సైతం నూజివీడుతోనే ఎక్కువ సంబంధం ఉంది. మొత్తంగా యనమదల, అన్నవరం, పోతురెడ్డిపల్లి, తుక్కులూరుతో పాటు రామన్నగూడెం గ్రామాలను నూజివీడులో కలపాలని గతంలోనే ప్రతిపాదనలు వెళ్ళాయి. ప్రస్తుతం నూజివీడు ఎమ్మెల్యే మంత్రి కావడంతో ఈ ప్రతిపాదనలు ఆమోదింపజేసి ఆయా గ్రామాల అభివృద్ధికి తోడ్పడే అవకాశం ఉంటుందని, ఆయా గ్రామాల వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



నెక్కలం గొల్లగూడెంలో తనిఖీలు

ఆగిరిపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మహేష్ ఆదేశాల మేరకు ఆదివారం నెక్కలం గొల్లగూడెం, ఆగిరిపల్లిలోని ఎరువుల దుకాణాలపై తనిఖీలు నిర్వహించినట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ అన్నారు. నెక్కలం గొల్లగూడెం హనుమాన్ ఏజన్సీస్, ఆగిరిపల్లి ఎండూరు శ్రీరామచంద్రమూర్తి ఎరువులు దుకాణాలను తనిఖీ చేయగా హనుమాన్ ఏజన్సీస్‌లో రూ. 2,75,550 విలువ కలిగిన 12.650 టన్నుల ఎరువులు వ్యత్యాసం గుర్తించి వాటిని సీజ్ చేశామన్నారు. 0-ఫారం లేనందున రూ.1,17,810 విలువ కలిగిన 3.850 టన్నుల ఎరువులు అమ్మకాలు నిలుపుదల చేసి, షాపు యజమానిపై కేసు నమోదు చేశామని అన్నారు. విజిలెన్స్ ఏఓ జి. మీరయ్య, విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్, ఆగిరిపల్లి మండల ఏఓ జె.భవానీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## 10న పెయ్యేరు పంచాయతీపై విచారణ

ముదినేపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెయ్యేరు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం, పరిపాలనాపరమైన అంశాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఈ నెల 10న విచారణ జరగనుంది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి కె. అనూరాధ ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ అధికారిగా ఏలూరు డీఎల్‌పీవో అమ్మాజీని నియమించారు. ఆ గ్రామానికి చెందిన దూబా చంద్రకాంత్ తదితరులు పంచాయతీ వ్యవహారాలపై చేసిన ఫిర్యాదులపై గత నెలలో ఏలూరు డీఎల్‌డీఓ లక్ష్మి విచారణ చేపట్టి కొన్ని సాంకేతిక కారణాలతో వాయిదా వేశారు. 2021 నుంచి 2024 వరకు పంచాయతీ ఆదాయ వ్యయాలు, నిధుల వినియోగంపై సమగ్రమైన విచారణ నిర్వహించేందుకు ఫిర్యాదుదారుతో పాటు సర్పంచ్, ఆయా సంవత్సరాల్లో పనిచేసిన కార్యదర్శులు 10న విచారణకు హాజరు కావాలని విచారణాధికారి నోటీసులు జారీ చేశారు.

## తాగునీటి చెరువులను నింపిన అధికారులు



పెదలంకలో నిండిన తాగునీటి చెరువు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలిదిండి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదలంక, మూల్లంక, మట్టగుంట, కొండంగి గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులను సర్పంచ్‌లు, డీసీ ఛైర్మన్లు, నీటి సంఘాల అధ్యక్షుల సహకారంతో అధికారులు పూర్తిస్థాయిలో నింపారు. ఆంధ్రజ్యోతిలో ఇటీవల 'బురదనీరే.. తాగునీరు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కోరుకొల్లు లాకుల నుంచి తాగునీటిని విడుదల చేసి ఆయా గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులకు నీటివంతు ఇచ్చారు. గ్రామస్థులు స్వచ్ఛందంగా రేయింబవళ్లు కాల్వల వెంబడి కాపలా కాస్తూ యుద్ధ ప్రాతిపదికన మోటార్లతో తాగునీటి చెరువులను నింపారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

## పంట కాల్వలోకి కలుషిత నీరు.. ప్రజల ఆందోళన



కొండంగి పంట కాల్వలో కలుషిత పసరు నీరు

కలిదిండి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొండంగి పంట కాల్వలోకి ఓ రైతు చేపల చెరువుల కలుషిత నీరు వదలటంతో కాల్వలో నీరు కలుషితమైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తాగునీటి చెరువులకు వంతు వెళ్తుండగా, కొంతమంది రైతులు చేపల, రొయ్యల చెరువుల్లో కలుషిత నీటిని కాల్వలోకి వదిలేయటంతో తాగునీటి చెరువులు కలుషితమై రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. నెలల తరబడి పంట కాల్వల్లో కలుషిత పసరు నీరు ఉండటంతో వనామి సాగు కష్టంగా మారింది. కలుషిత నీరు తోడితే చెరువుల్లో రొయ్యలకు వైరస్ సోకి చనిపోతాయని ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చేపల చెరువుల్లో కలుషిత నీరును కాల్వల్లోకి వదులుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈఈ ఫణి కుమార్‌ను వివరణ కోరగా.. పంట కాల్వల్లోకి చేపల చెరువుల కలుషిత నీరు వదిలే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నోటీసులు జారీ చేసి చేపల చెరువుల లైసెన్స్ రద్దు చేసే విధంగా మత్స్యశాఖ అధికారులకు సిఫార్సు చేస్తామన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం


కలిదిండి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీచర్స్ డేను పురస్కరించుకుని కలిదిండి మార్కెట్ యార్డులో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆవకూరు ఎంపీపీ స్కూల్‌కి చెందిన వి.ప్రకాశరావు, భోగేశ్వరం పాఠశాలకి చెందిన టి.జమియా గుర్వాయిపాలెం పాఠశాలకు చెందిన డివి.సత్యజగదాంబ, అమరావతి పాఠశాలకు చెందిన కె.సతీష్ కుమార్, కొచ్చెర్ల పాఠశాలకు చెందిన కె.చక్రవర్తి, యడవల్లి పాఠశాలకు చెందిన బి.రామాంజనేయులు, సున్నంపూడికి పాఠశాలకు చెందిన ఎస్.లక్ష్మీనరసింహారావు, అమరావతికి పాఠశాలకు చెందిన ఎస్.రూన్సీ, భాస్కరరావుపేట పాఠశాలకు చెందిన డి.నాగ శిరీష ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిని డిప్యూటీ ఈవో వి.సత్యనారాయణ, ఎంఈవో అనిశెట్టి శ్రీనివాస్, సీఆర్పీ జి.వెంకటేష్ సత్కరించారు.

## రహదారుల మార్జిన్లలో తుప్పల తొలగింపు



ముసునూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌అండ్‌బీ రహదారుల మార్జిన్లలో జంగిల్ క్లియరెన్స్ పనులను రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో అధికారులు చేపట్టారు. చింతలవల్లిలో ఈ పనులను టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కాటేపల్లి సురేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ రహదారుల మార్జిన్‌లో తుప్పలు పెరిగిపోవడంతో వాహదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఆదేశించడంతో వారంలో సంబంధిత అధికారులు టెండర్ ప్రక్రియను పూర్తిచేసి పనులు ప్రారంభించారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల మార్జిన్ క్లియరెన్స్‌ను గాలికి వదిలివేయడంతో ముళ్ల కంచెలు, పిచ్చి మొక్కలతో రోడ్లు మూసుకుపోయాయని విమర్శించారు. రహదారుల మార్జిన్‌లు శుభ్రపడుతుండటంతో వాహనదారులు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 132, 141, 152 |
| చికెన్ విత్ స్కిన్ | 250 |
| చికెన్ స్కిన్‌లెస్ | 260 |

**నెక్ కోడి గుడ్డు ధర (100)**

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

## మోతాదుకు మించి యూరియా వాడవద్దు

ముదినేపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూరియా వినియోగంపై రైతులకు వ్యవసాయ శాఖ అవగాహన కల్పిస్తోంది. ఆదివారం ముదినేపల్లి మండలం వడాలి, గురజ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల వద్ద జరిగిన అవగాహన కార్యక్రమాల్లో ఏవో మాట్లాడుతూ శాస్త్రవేత్తలు సిఫార్సు చేస్తున్న మోతాదులోనే యూరియాను వినియోగించాలని, ఎకరానికి సీజన్ మొత్తం మీద రెండు కట్టల యూరియాను మాత్రమే వాడాలని తెలిపారు. మోతాదుకు మించి యూరియా వాడకం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. ప్రతి ఎకరాకు యూరియా అందుతుందని, ప్రస్తుతం మండలంలో 45 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. రోజుకు రెండు సొసైటీల వద్ద యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. స్థానిక వ్యవసాయ సహాయకులు, గురజ టీడీపీ నాయకుడు అడుసుమిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## 'మేము సైతం' వితరణ

ముదినేపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీలో దివ్యాంగులకు, రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు 'మేము సైతం' టీం సభ్యులు ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. టీం సభ్యులతో పాటు పలువురు దాతల సహకారంతో వీటిని పంపిణీ చేశారు. ఎస్ఐ వీరభద్రరావు, హైవే ఎఈవో జి భాను ప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, కైకలూరు న్యాయవాదులు పిచ్చికల పవన్ కాంత్, తణుకుల రవితేజ, మేము సైతం టీము సభ్యుడు మొవ్వ ఫణీంద్ర నిత్యావసర సరుకులను అందజేశారు. టీం ప్రతినిధులు భూపతి రవీంద్ర, పాగోలు విజయసాగర్, ధర్మ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చండీహోమం

మండవల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి, చంద్రగ్రహణం సందర్భంగా దత్తాశ్రమంలో చండీహోమాలను యాజ్ఞికుడు ఫణిశర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆదివారం లోకుమూడి దత్తాశ్రమంలో ట్రస్టీ అధ్యక్షుడు గురజాడ ఉదయ్‌శంకర్ ఆధ్వర్యంలో జరిగిన హోమపూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

# స్వల్ప పెనాల్టీతో.. గట్టెక్కారు!

(5వ పేజీ తరువాయి)

ఒక శాతం సర్వీసు చార్జీని పొగాకు నిధికి చెల్లించాల్సి ఉంటుంది.

● బ్యారన్ కోటాలో పది నుంచి ఇరవై శాతం వరకు కిలోకు రూ.1 చొప్పున పెనాల్టీ, అమ్మకాల విలువపై 2 శాతం, సాధారణ సర్వీసు చార్జీ ఒకశాతం మొత్తం 3 శాతం సర్వీసు చార్జీలు వసూలు చేస్తారు. 20 శాతం కంటే ఎక్కువగా ఉన్న పొగాకుకు కిలో పొగాకుకు రూ.1 పెనాల్టీతో పాటు, అమ్మకాల విలువపై 3 శాతం, సాధారణ సర్వీసు చార్జీ ఒక శాతం మొత్తం 4శాతం వసూలు చేస్తారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ముసునూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరగకుండా లబ్ధిదారులకు రేషన్‌ను అందించేందుకు కూటమి ప్రభుత్వం స్మార్ట్ రైస్ కార్డులను ఇస్తోందని సర్పంచ్ చలసాని దామోదరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మేదరమెట్ల సురేంద్ర అన్నారు. ఆదివారం వలసపల్లిలో ఇంటింటికి వెళ్ళి లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేశారు. అలాగే గోపవరంలో సొసైటీ అధ్యక్షులు ఉప్పలపాటి గణేష్, రమణక్కపేటలో ఎంపీడీవో బీపీ సత్యనారాయణ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు రంగు శ్రీనివాసరావు, అక్కిరెడ్డిగూడెంలో సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు గద్దె రఘుబాబు, గ్రామ అధ్యక్షుడు బర్మా శ్రీనివాసరావు లబ్ధిదారులకు స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేశారు.



వలసపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్, నాయకులు

**ఆగిరిపల్లి:** ప్రజాపంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా అమలుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ గ్రామ అధ్యక్షుడు పామర్తి నరసయ్య అన్నారు. ఆదివారం ఆగిరిపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఉలాస నాగరాజు, సర్నాల సాంబయ్య, యాదల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా జిల్లా స్థాయి యోగా పోటీలు

ఆగిరిపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగా చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ఆగిరిపల్లిలోని శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో గల కల్యాణ మండపంలో నిర్వహించారు. జిల్లా నుంచి సుమారు 56 మంది పాల్గొనగా వీరిలో 8 మంది బంగారు పతకాలు, నలుగురు వెండి పతకాలు, ముగ్గురు కాంస్య పతకాలు గెలుపొందారు. జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు యండూరి నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి బొద్దూరు సాంబశివరావు విజేతలకు బహుమతులు అందజేశారు. మడుపల్లి గోపాల్, యండూరి ప్రణీత్, వేదాంతం శేషుబాబు, తవ్వ మురళీధర్, సగ్గుర్తి కమల కుమారి, విజయ్ భాస్కరరావు పాల్గొన్నారు.



తాము సాధించిన పతకాలతో విజేతలు





మూతపడిన కైకలూరులోని శ్రీ శ్యామలాంబ, ఆగిరిపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాలు

## చంద్ర గ్రహణంతో.. మూతపడిన ఆలయాలు

కైకలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణం సందర్భంగా పలు ఆలయాలు మూతపడ్డాయి. కైకలూరు శ్రీ శ్యామలాంబ, మీసాల వేంకటేశ్వరస్వామి, వరహాపట్నం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలు మూసివేసినట్లు ఈవో శేఖర్ తెలిపారు. అలాగే కొల్లేటికోట శ్రీ పెద్దింటి అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చినప్పటికీ మధ్యాహ్నం నుంచి ఆలయాన్ని మూసి వేశారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి భక్తులకు యథావిధిగా దర్శనాలు కల్పిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

**ముదినేపల్లి:** దేవదాయ శాఖ కమిషనర్ స్థాయి ఆలయమైన సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంతోపాటు ప్రధాన ఆలయమైన వడాలిలోని శ్రీ సుభద్ర బలరామ సమేత జగన్నాథ స్వామి తదితర ఆలయాలను అర్చకులు మూసివేశారు. సంప్రోక్షణ నిర్వహించి సోమవారం ఉదయం 9 గంటల నుంచి భక్తులకు స్వామివార్ల దర్శనం కల్పిస్తామని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి తెలిపారు.

**కలిదిండి:** కలిదిండిలో పాతాళ భోగేశ్వరస్వామి, కోరుకొల్లులో సోమేశ్వరస్వామి, పెదలంకలో నాగేశ్వర స్వామి, కలిదిండిలో వేంకటేశ్వరస్వామి ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం తెరుస్తామని గ్రూపు దేవాలయాల ఈవో శేఖర్ తెలిపారు.

**ఆగిరిపల్లి:** శోభనగిరిపై ఉన్న శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం 9.30 గంటలకు ఆలయంలోకి భక్తులను అనుమతిస్తామని అర్చకులు తెలిపారు.

## దానగూడెం ఘటనలో ఏడుగురి అరెస్టు

(5వ పేజీ తరువాయి)

అనుమతులు నిరాకరించారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కరకట్ట, దానగూడెం గ్రామానికి చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైన అనుమానాస్పదమైన వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కైకలూరు బైపాస్ రోడ్డు చిన్నచెరువుగట్టు వద్ద, కరకట్ట ఆంజనేయ స్వామి గుడివద్ద పోలీసు పికెట్‌లను ఏర్పాటు చేశారు.



కైకలూరు చిన్నచెరువు గట్టు వద్ద పికెట్ నిర్వహిస్తున్న పోలీసులు

కైకలూరు టౌన్ సీఐ కృష్ణ, రూరల్ సీఐ రవికుమార్ పర్యవేక్షణలో గస్తీ నిర్వహిస్తున్నారు. కైకలూరులో ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉంది.

## ముదినేపల్లి ఎంపీడీవోకు డ్వామా ఏపీడీగా పదోన్నతి



రామకృష్ణ

ముదినేపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముదినే పల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి యద్దనపూడి రామకృష్ణకు పదోన్నతి లభించింది. ఆయనను అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డ్వామా ఏపీడీగా నియమిస్తూ పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

## హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక భవన్‌లో నిర్వహించిన ముఠా హమాలీ కార్మికుల మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల కార్మికహక్కులపై నిరంకుశ దాడులకు పాల్పడుతున్న కార్పొరేట్ వర్గాల తీరు పై ఉద్యమించటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి.శ్రీనివాస్, ఉపప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## రేపు ముదినేపల్లి మండల పరిషత్ సమావేశం

ముదినేపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9న జరుగనుంది. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు.

## ప్రశాంతంగా ఉత్సవాలు



ఎస్ఐ వీరభద్రరావు

ముదినేపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలు ముదినేపల్లి మండలంలో ప్రశాంతంగా జరిగాయని ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన సుమారు 90 మంట పాల్లో నిర్వాహకులు పోలీస్‌శాఖ నిర్దేశించిన సూచనలను పాటించి ఉత్సవాలను విజయ వంతం చేశారని తెలిపారు. నిమజ్జనోత్సవాల్లో మంట పాల కమిటీలు బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీస్‌శాఖకు సహకరించారని పేర్కొంటూ దసరా ఉత్సవాల నిర్వహణలో కూడా నిర్వాహకులు ఇదే సహకారం అందించాలని ఎస్ఐ కోరారు.

## మద్యం మత్తులో జారిపడిన వ్యక్తి మృతి

ముసునూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందిన సంఘటన రమణక్కపేటలో ఆదివారం చోటు చేసుకుంది. తోట మురళీకృష్ణ (37) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. అయితే మద్యానికి బానిసై నిత్యం తాగుతూనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న మురళీకృష్ణ ఉదయం ఇంటిలో ప్రమాదవశాత్తు కాలు జారీ కింద పడటంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబీకులు 108లో నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. మృతుడికి భార్య ఉంది.

# ఉపాధ్యాయ ఉద్యోగాలకు వినికిడి అంకెల టాంపరింగ్!

**ధ్రువపత్రాల్లో దిద్దివేతలపై జిల్లా విద్యాశాఖ ఫిర్యాదు**

**విచారణ చేపట్టిన గుంటూరు జీజీహెచ్ వైద్యనిపుణుల కమిటీ**

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్‌లో దివ్యాంగుల అంగ వైకల్య శాతాన్ని నిర్ధారిస్తూ జారీచేసిన సర్టిఫికెట్లను టాంపరింగ్ చేసినట్టు ధ్రువపడింది. ఈ మేరకు తమ దృష్టికి వచ్చిన వీహెచ్ ధ్రువపత్రాలపై సందేహం వ్యక్తం చేస్తూ కొద్దిరోజుల క్రితం పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి జిల్లా విద్యాశాఖ తీసుకెళ్లడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై గుంటూరు జీజీహెచ్‌లో విచారణ జరుగుతున్నట్టు సమాచారం. సర్టిఫికెట్ల ట్యాంపరింగ్ ఎక్కడ జరిగింది, ధ్రువపత్రాల్లో వైకల్యశాతాన్ని మార్చివేసిన ఆనవాళ్లు, బాధ్యులెవరు, తదితర అంశాలపై విచారణ కమిటీ సోమవారం నివేదిక ఇవ్వనున్నట్టు సమాచారం.

డీఎస్సీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సెలక్షన్ జోన్ పరిశీలనకు వచ్చిన అభ్యర్థులకు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైనవారిలో ఫిజికల్లీ హ్యాండీకాప్డ్ అభ్యర్థుల వైకల్యశాతాన్ని నిర్ధారిస్తూ మెడికల్ బోర్డు జారీచేసే ధ్రువపత్రాలను తీసుకుని సమర్పించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆరుగురు దివ్యాంగ (వినికిడి లోపం) అభ్యర్థులను గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ బోర్డుకు ఇటీవల జిల్లా విద్యాశాఖ పంపగా, అక్కడ జారీ చేసిన సర్టిఫికెట్లలో కొన్నింటిపై వైకల్య శాతాన్ని నిర్ధారించే అంకెల్లో దిద్దివేతలు/మార్పులు చేర్పులు చోటు చేసుకున్నట్టు గమనించారు. ఇదే విషయాన్ని కొద్దిరోజుల వ్యవధిలోనే విద్యాశాఖ ఉన్నతాధికారులు అన్నిజిల్లాల విద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో చెప్పినట్టు తెలిసింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు గుంటూరు జీజీహెచ్ మెడికల్ బోర్డు జారీ చేసిన వినికిడి లోపం అభ్యర్థుల ధ్రువపత్రాలను ఏలూరు జీజీహెచ్ మెడికల్ బోర్డుతో రీవెరిఫికేషన్/రీఅసెస్‌మెంట్ చేయించాలని ఆదేశించారు. మొత్తం ముగ్గురు వైద్య నిపుణులతో కూడిన మెడికల్ బోర్డు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సంబంధిత తొలుత అభ్యర్థులకు ఆడియోమెట్రీ టెస్టులు చేసి, వారికి గుంటూరు జీజీహెచ్ మెడికల్ బోర్డు జారీచేసిన వైకల్యశాతాన్ని తిరస్కరించింది. మొత్తం నలుగురు అభ్యర్థులకు జారీచేసిన ధ్రువపత్రాలపై జరిపిన రీవెరిఫికేషన్/ రీఅసెస్‌మెంట్‌లో ఇద్దరికి ఆడియో మెట్రీ టెస్టుల్లో సంబంధించిన వినికిడి లోపం(హెచ్‌ఐ) నిర్ణీత 50 శాతం లేనందున తొలుత ఇచ్చిన సర్టిఫికెట్లను తిరస్కరించినట్టు సమాచారం. మరో ఇద్దరు అభ్యర్థులకు జారీ అయిన సర్టిఫికెట్లలో పేర్కొన్న ప్రకారమే వైకల్య శాతం ఉన్నప్పటికీ ధ్రువపత్రాల్లో ఏమైనా టాంపరింగ్ జరి గిందా, లేదా అనే విషయాలు బయటకు తెలియడం లేదు. కాగా ఆర్థో(శారీరక అంగవైకల్యం) కోటాలో డీఎస్సీకి ఎంపికైన ఒక అభ్యర్థి తనకు అవగాహన లేకపోవడం వల్లే సంబంధిత కోటాలో దరఖాస్తు చేశానని, ఈ డబ్ల్యూఎస్ కోటాలో తనకు ఉద్యోగంవచ్చే అవకాశం ఉన్నందున ఆర్థో కోటానుంచి తనను తప్పించాలని లిఖితపూర్వకంగా జిల్లా విద్యాశాఖను అభ్యర్థించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక దృష్టిలోపం(వీహెచ్) కోటాలో డీఎస్సీకి ఎంపికైన ఒక మహిళాఅభ్యర్థికి ఏలూరు మెడికల్ బోర్డు జారీచేసిన ధ్రువపత్రంలో పేర్కొన్న వైకల్యశాతంపై రీఅసెస్‌మెంట్ కోసం ఆశ్రం ఆసుపత్రికి శనివారం పంపగా, పునఃపరిశీలన నివేదికను సీల్డ్‌కవర్‌లో పెట్టిఇచ్చినట్టు తెలిసింది.

**బాధ్యులెవరు..?**

వినికిడి లోపంవున్న అభ్యర్థులకు జారీచేసిన సర్టిఫికెట్లపై గుంటూరు జీజీహెచ్ మెడికల్ బోర్డు ఒకరికి 26శాతం వైకల్యాన్ని నమోదుచేయగా దానిని 62 శాతంగా దిద్దివేశారని, మరొకరికి 35 శాతం ఉన్నట్టుగా నిర్ధారిస్తే ఆ అంకెను 65 శాతంగా టాంపరింగ్ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. తమకు అందిన సర్టిఫికెట్లను జిల్లావిద్యాశాఖ అధికారులు, కొందరు ఉద్యోగులు నిశితంగా గమనిస్తే అంకెల టాంపరింగ్ బయటపడింది. గుంటూరు, ఏలూరు జిల్లాల విద్యాశాఖల్లో పనిచేస్తున్నవారికే ఈ టాంపరింగ్ వ్యవహారంలో పాత్ర ఉండవచ్చని ప్రచారం ఒకటి ఉంది. ఈ రెండు జిల్లాల డీఈవో కార్యాలయాల అధికారులకే బాధ్యతలను ఇచ్చినట్టు సమాచారం. అలాకాకుంటే జీజీహెచ్ స్థాయిలోనే అవకతవకలను తోసిపుచ్చలేమని మరో ప్రచారం ఉంది. ఏదైనా విచారణ కమిటీ నివేదిక, పోలీసు ఎంక్వయిరీల్లోనే అసలు విషయాలు బయటకు వస్తాయని చెబుతున్నారు. డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల నిశితపరిశీలనను ఇప్పటికీ ఏలూరు డీఈవో కార్యాలయంలో పలుమార్లు కొనసాగిస్తుండడం గమనార్హం.